

జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 అనుసంధాన పనులు షురూ



ఇన్‌శాట్-త్రీడీ ఉపగ్రహం

శ్రీహరికోటలోని షార్‌లో జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ప్రయోగానికి సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి.ఈ ఏడాది తొలి రోజు ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సీ 58 రాకెట్ ద్వారా ఎక్స్‌పోశాట్ ఉపగ్రహాన్ని విజయవంతంగా పంపారు. ఇదే ఉత్సాహంతో శాస్త్రవేత్తలు ఈ నెల 17న జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ద్వారా ఇన్‌శాట్-త్రీడీ ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. ఇందులో అత్యాధునిక 19 పేలోడ్‌లను కూడా పంపుతున్నారు.షార్‌లోని రెండో ప్రయోగ వేదిక వద్ద ఇప్పటికే రెండు దశల అనుసంధాన పనులు పూర్తి కాగా మూడవ దశ పనులు జరుగుతున్నారు.గత నెల 27న బెంగళూరులోని ఉపగ్రహ తయారీ కేంద్రం నుంచి ఇన్‌శాట్-త్రీడీ ఉపగ్రహాన్ని షార్‌కు తీసుకొచ్చారు. క్లీన్‌రూమ్‌లో ఉపగ్రహాన్ని పెట్టి తుది పరీక్షలు నిర్వహించారు.దీన్ని హీట్‌షీల్డ్‌లో అమర్చి రాకెట్ శిఖర భాగాన అనుసంధానిస్తారు. 2275 కిలోల బరువు గల ఇన్‌శాట్-త్రీడీ ఉపగ్రహం ద్వారా వాతావరణ పరిస్థితుల అంచనాతో పాటు విపత్తుల హెచ్చరికలను తెలుసుకోవచ్చు.

- సూళ్లూరుపేట



ముక్కంటి సేవలో రష్యన్లు

రాహు కేతు పూజల్లో రష్యన్ భక్తులు

శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం 30మంది రష్యన్లు దర్శించుకున్నారు.అంతకుముందు ఆలయంలోని రాయలవారి మండపంలో రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలు జరిపించుకున్నారు.దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితుల ఆశీర్వాదం పొందారు. అనంతరం ఆలయంలోని పొగడ చెట్టు వద్ద శివనామస్మరణ చేశారు.ముక్కంటి ఆలయ శిల్ప సౌందర్యం ఆకట్టుకుందని తెలిపారు.

-శ్రీకాళహస్తి

ఒకే ఇంట్లో 32 ఓట్లు !



తిరుపతి నగరం 33వ డివిజన్లో వున్న అబ్బన్న కాలనీ ప్రాంతంలోని 124వ పోలింగ్ బూత్‌లో ఒకే ఇంటి చిరునామాతో ఏకంగా 32 ఓట్లు బయటపడ్డాయి. డోర్ నెంబరు 18-39ఎస్4-407 గల ఆ ఇల్లు నిజానికి ఓ చిన్న బెడ్ రూమ్ వున్న ఇల్లు.పైగా ఈ ఇంటి చిరునామాలో వున్న 32మంది ఓటర్లు ఈ ప్రాంతానికే చెందినవారు కాదని 33వ వార్డు టీడీపీ అధ్యక్షుడు రాజేంద్ర చెప్పారు. ఈ 32 ఓట్లను దొంగ ఓట్లుగా గుర్తించి తొలగించాలని నగరపాలకసంస్థ కమిషనర్,ఈఆర్వో హరితకు పలు మార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. బీఎల్వోలను పంపి విచారణ చేయిస్తామని చెప్పారే కానీ వాస్తవంగా పట్టించుకోనే లేదన్నారు.కలెక్టర్ అయినా స్పందించి ఇలాంటి దొంగ ఓట్లు ఇంకా ఎక్కడెక్కడ వున్నాయో గుర్తించి తొలగించాలని ఆయన మీడియా సమావేశంలో విజ్ఞప్తి చేశారు.

- తిరుపతి(తిలక్‌రోడ్)

వైసీపీ రివర్స్ గేర్

- నారాయణస్వామి జీడీనెల్లూరుకే
- రెడ్డప్ప చిత్తూరు పార్లమెంటుకే
- ఇద్దరికీ మళ్లీ పాత స్థానాలే
- పోటీకి ఇద్దరూ విముఖత చూపడంతోనే ఈ నిర్ణయం?



చిత్తూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎంపీ, జీడీనెల్లూరు అసెంబ్లీ ఇన్‌చార్జుల ప్రకటన విషయంలో వైసీపీ అధిష్ఠానం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. నాలుగో జాబితాలో ప్రకటించిన పేర్లను.. శుక్రవారం విడుదల చేసిన ఆరో జాబితాలో మార్చేసింది. నారాయణస్వామి నేరుగా సీఎం జగన్‌ను కలిసి మరో అవకాశం కోసం అభ్యర్థించడం, ఆయన వర్గం నుంచి తీవ్ర అసమ్మతి రాగం వినిపించడం కారణాలుగా తెలుస్తున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో తిరుపతి లోక్‌సభ ఇన్‌చార్జిగా ఎంపీ గురుమూర్తిని రీబ్యాక్ చేయడం.. సత్యవేడు ఇన్‌చార్జిని మార్చిన విషయం తెలిసిందే.

డిప్యూటీ సీఎం నారాయణస్వామికి సొంత నియోజకవర్గం జీడీనెల్లూరులో గట్టి వ్యతిరేక వర్గం ఉన్న విషయం తెలిసిందే. జ్ఞానేంద్రరెడ్డి, దయాసాగర్‌రెడ్డి వంటి ఆయన వ్యతిరేకులకు మంత్రి పెద్దిరెడ్డి మద్దతు కూడా ఉండడంతో వారంతా నారాయణస్వామికి వ్యతిరేకంగా గట్టిగా పనిచేశారు. నారాయణస్వామికి టికెట్ ఇస్తే పనిచేసేది లేదని అనేకమార్లు ప్రకటించారు. పెనుమూరు మండలంలో డిప్యూటీసీఎం పర్యటిస్తే అడ్డుకోవడాలు అనేకం ఉన్నాయి. దీంతో అధిష్ఠానం విడుదల చేసిన నాలుగో జాబితాలో నారాయణస్వామికి జీడీనెల్లూరు కాకుండా చిత్తూరు లోక్‌సభ ఇన్‌చార్జిగా అవకాశం కల్పించారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్పను జీడీనెల్లూరు ఇన్‌చార్జిగా ప్రకటించారు. దీంతో నారాయణస్వామి వ్యతిరేకవర్గం తామే గెలిచామంటూ సంబర పడింది. దీనికి దీటుగా నారాయణస్వామి అనుకూలవర్గం నియోజకవర్గంలోని ప్రతి మండలంలోనూ ప్రెస్‌మీట్లు పెట్టి రెడ్డెప్ప అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించింది. ఆయా మండలాల నాయకులు చిత్తూరు, తిరుపతి ప్రెస్‌క్లబ్‌లలోనూ ప్రెస్‌మీట్లు పెట్టి నారాయణస్వామికే మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. దీనికి అనుగుణంగా నారాయణస్వామి కూడా నేరుగా సీఎం జగన్‌ను కలిసి, తనకు మరో అవకాశం కల్పించాలని కోరారు. పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి వంటి నాయకులను నమ్ముకోకుండా నేరుగా సీఎంను కలవడంతోనే ఆయనకు మరో అవకాశం దక్కినట్లు నారాయణస్వామి వర్గీయులు చెబుతున్నారు. జిల్లాను శాసిస్తున్న రెడ్లతో పాటు నియోజకవర్గంలోని రెడ్లను తట్టుకుని, అధిష్ఠాన నిర్ణయాన్ని మార్పించుకోవడంతో నారాయణస్వామి వర్గీయులు సంబర పడుతున్నారు.

- ఇదిలా ఉండగా, ఎంపీ రెడ్డెప్ప కూడా జీడీనెల్లూరు నుంచి పోటీ చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. అసెంబ్లీ ఇన్‌చార్జిగా నియమించినా.. ఆయన నియోజకవర్గంలో పర్యటించలేదు. పరిచయాలు పెంచుకోలేదు. ఓ సందర్భంలో చిత్తూరులో ఆయన మాట్లాడుతూ 'సీట్ల సర్దుబాటు విషయంగా నేను స్పందించను. అధిష్ఠానం ఆదేశాల మేరకు నడుచుకుంటాను. పోటీ చేస్తాను. నారాయణస్వామి నాకు మంచి మిత్రుడు' అని చెప్పారు. అంటే తనకు ఫలానా టికెట్ కావాలని ఆయన ఎన్నడూ కోరలేదు.

అధికారపార్టీలో అభద్రతాభావం

ఓసారి ప్రకటించిన ఇన్‌చార్జులను మరోసారి కూడా వైసీపీ అధిష్ఠానం మారుస్తుండడంతో ఆ పార్టీ అభ్యర్థుల్లో ఆందోళన మొదలైందనే చెప్పాలి. ఆదిమూలం ఎఫెక్ట్‌తో తిరుపతి లోక్‌సభకు ఎంపీ గురుమూర్తిని వెనక్కి పంపి.. సత్యవేడు అసెంబ్లీకి కొత్త నేతను ఇన్‌చార్జిగా ప్రకటించింది. ఇక, చిత్తూరు ఎంపీ, జీడీనెల్లూరు అసెంబ్లీ ఇన్‌చార్జుల విషయంలో రివర్స్ గేరులో వెళ్లింది. ఈ పరిణామాలతో ఇప్పటికే ఇన్‌చార్జులుగా నియమితులైన వారితో పాటు తమకే సీటు అనుకుంటున్న అభ్యర్థుల్లోనూ అభద్రతాభావం మొదలైంది. ఈ జాబితాలో తమ పేరున్నప్పటికీ, మరో జాబితాలో ఉంటుందా.. ఊడుతుందా అని ఉమ్మడి జిల్లాలోని పలువురు ఆందోళన చెందుతున్నారు.



బాలుడు కిందకు దిగిన మూడవ గోపురం ప్రదేశం



మూడవ గోపురం సమీపంలో ప్రాకారం వద్ద ఉన్న నిచ్చెన



పార్థసారథి రెడ్డిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

ఉలిక్కిపడ్డ శ్రీకాళహస్తి!

- అర్ధరాత్రి ముక్కంటి ఆలయంలో సంచరించిన 14యేళ్ల బాలుడు
- దర్జాగా నిచ్చెన సహాయంతో వేకువజామున వెలుపలకు రాక
- నిఘా వైఫల్యంపై దుమారం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2: ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో భద్రతా వ్యవస్థ డొల్లతనం బట్టబయలైంది.తొమ్మిదో తరగతి చదివే విద్యార్థి అర్ధరాత్రి ఆలయంలో దర్జాగా సంచరించాడు. తర్వాత పెద్ద నిచ్చెన సహాయంతో ప్రాకారం పైనుంచి దిగి తాపీగా కిందకు వచ్చాడు.

వివరాల్లోకి వెళితే.. శ్రీకాళహస్తి శివారు ప్రాంతం సాయిబాబా నగర్‌కు చెందిన గౌరి పట్టణంలోని ఐసీడీఎస్ కేంద్రంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తుంటారు. ఆమెకు పార్థసారధి రెడ్డి (14) అనే మానసికంగా పరిణతి చెందని కుమారుడున్నాడు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. తండ్రి మరణించడంతో అమ్మ,బాబాయ్ పర్యవేక్షణలో విద్యార్థి పెరుగుతున్నాడు. పరీక్షల్లో చూసి రాస్తున్నాడంటూ పాఠశాల సిబ్బంది కుటుంబ సభ్యులకు ఫిర్యాదు చేయడంతో గురువారం సాయంత్రం ఇంట్లో పార్థసారధి రెడ్డిని మందలించారు.ముక్కంటి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల కోసం పెయింటింగ్ పనులు చేస్తున్నారు.అందుకోసం ఆలయ ప్రాకారానికి ఇరువైపులా సారవ కొయ్యలు, నిచ్చెనను ఉంచారు. ఆలయంలోకి పార్థసారధి రెడ్డి ఎప్పుడు ప్రవేశించాడో.. ఎలా వెళ్లాడో ఎవ్వరూ గుర్తించలేదు.అర్ధరాత్రి ఆలయంలో సంచరించాడు.శుక్రవారం వేకువజామున మూడు గంటల సమయంలో బయటకు వెళ్లేందుకు ప్రయత్నించాడు. మొదట రూ.750రాహు కేతు సర్పదోష నివారణ పూజా మండపం పైకి ఎక్కాడు.అక్కడికి సమీపంలో ఉన్న నిచ్చెనను తీసుకున్నాడు. ఆలయ మూడో గోపురం పక్కనే ప్రాకారం నుంచి నిచ్చెన అనువుగా ఏర్పాటు చేసుకుని కిందకు దిగాడు. సన్నిధి వీధిలో వున్న ఓ లాడ్జిలో పని చేసే యువకుడు ఆలయం నుంచి పార్థసారధి రెడ్డి బయటకు రావడం గుర్తించి ప్రశ్నించాడు.ఇది గమనించిన స్థానికులు బ్లూ కోల్ట్ పోలీసులకు పార్థసారధి రెడ్డిని అప్పగించారు. వన్‌టౌన్ పోలీసులు పార్థసారధి రెడ్డి తల్లిని, బాబాయ్‌ని స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పార్థసారధి రెడ్డిని అప్పగించారు.

అసాంఘిక శక్తులు చొరబడివుంటే...?

ముక్కంటి ఆలయంలో భద్రతా వ్యవస్థపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి.నిజానికి ముక్కంటి ఆలయానికి భారీ భద్రతా వ్యవస్థ ఉంది.260మంది సెక్యూరిటీ గార్డులు,32మంది హోంగార్డులే కాక 17మందితో కూడిన ఎస్పీఎఫ్ బలగాలున్నాయి. వీరందరినీ పర్యవేక్షించేందుకు ఉన్నతాధికారులు కూడా వున్నారు.అయినప్పటికీ ఒక బాలుడు అర్ధరాత్రి ఆలయంలోకి ప్రవేశించడమే కాకుండా.. ఎవరి కంటాపడకుండా వెలుపలికి రావడం గమనార్హం.పార్థసారధి రెడ్డి స్థానంలో అసాంఘిక శక్తులు ఆలయంలోకి చొరబడి ఉంటే పరిస్థితి ఏంటనేది ప్రశ్న.ఒకవైపు సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. మరోవైపు మహాశివరాత్రి ఉత్సవాలు 20 రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఇంతటి కీలక సమయంలో ఇలాంటి ఘటన వెలుగు చూడడం భద్రతావ్యవస్థకు అవమానకరంగా మారింది.రెండు నెలల నుంచి కొందరు అధికారులు అత్యుత్సాహంతో ఎస్పీఎఫ్ బలగాలకు మహాద్వారం వద్ద రిజిస్టర్ నమోదు చేసే విధులను అప్పగించారు.దీంతో భద్రతా సిబ్బంది రిజిస్టర్లు చేతబట్టి వచ్చిపోయే ప్రముఖుల పేర్లు రాసుకోవడంపై దృష్టి పెట్టి అసలు విధులను గాలికొదిలేశారన్న విమర్శలు విన్పిస్తున్నాయి.

ఆలయంలో నిద్రపోయాడట!

ముక్కంటి ఆలయంలోకి బాలుడు పార్థసారధి రెడ్డి చొరబడలేదని.. తెరిచి ఉన్న సమయంలోనే లోపలకు వచ్చి నిద్రపోయాడని అధికారులు శుక్రవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు.ఆలయం మూత వేసిన సమయంలో ఎక్కడో నిద్రపోయాడని... ఆ తరువాత అనుమానాస్పదంగా సంచరిస్తున్న బాలుడిని ఎస్పీఎఫ్ పోలీసులు గుర్తించారని తెలిపారు.అదమరిచి ఆలయంలో నిద్రపోయినట్లు ఆలయ డిప్యూటీ ఈవో వెంకట సుబ్బయ్య వివరణ ఇచ్చారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఒకటవ పట్టణ పోలీసులు పేర్కొన్నారు.అయితే ఎస్పీఎఫ్ పోలీసులు బాలుడిని అదుపులోకి తీసుకుని ఉంటే ఆధారాలు ఎందుకు బహిర్గతం చేయలేదనేది ప్రశ్న. బాలుడు నిద్రపోయి ఉంటే ఆలయంలో అడుగడుగునా ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్‌లను ఎందుకు వెల్లడించలేదు? అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించే సమయంలో ఒక ఫొటో కూడా ఎందుకు తీసుకోలేదు? స్థానికులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లిన తర్వాతే ఆలయ యంత్రాంగం మేలుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోందని చెబుతున్నారు.

తిరుమలలో ధార్మిక సదస్సుకు ఏర్పాట్లు పూర్తి

తిరుమల, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమల ఆస్థానమండపంలో శనివారం నుంచి మూడురోజుల పాటు జరగనున్న సనాతన ధార్మిక సదస్సుకు టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది.హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సదస్సులో 59మంది పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు.మరికొంతమంది వర్చువల్‌గా సదస్సులో పాల్గొని ధార్మిక అంశాలపై చర్చిస్తారు.సదస్సు ఏర్పాట్లను శుక్రవారం అధికారులతో కలిసి టీటీడీ ఛైర్మన్ కరుణాకర రెడ్డి, ఈవో ధర్మారెడ్డి పరిశీలించారు.శనివారం ఉదయం వేదస్వస్తి, టీటీడీ నిర్వహించిన ధార్మికకార్యక్రమాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్, పీఠాధిపతుల అనుగ్రహ భాషణం ఉంటాయి. మధ్యాహ్నం ప్రాథమిక గోష్ఠి, ద్వితీయ గోష్ఠి కార్యక్రమాలు జరుగుతాయి.

రేషన్ కోసం ఒక వేలిముద్ర చాలు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి2: రేషన్ పొందే కార్డుదారులు శనివారం నుంచి బయోమెట్రిక్ విధానంలో ఒకసారి వేలిముద్ర వేస్తేచాలని జేసీ శ్రీనివాసులు తెలిపారు.శుక్రవారం రాత్రి జరిగిన వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయన అధికారులతో మాట్లాడారు.ఎండీయూ వాహనాల ద్వారా ఉచితంగా, నగదుతో పొందే నిత్యావసర వస్తువుల కోసం ఇకపై ఒక్కసారి మాత్రమే వేలిముద్ర వేయాలని, రెండో వేలిముద్ర కోసం ఒత్తిడి చేయొద్దన్నారు.

వరిపంటకు తెగుళ్లు



తెగుళ్లు సోకిన వరిపైరు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 2: వరి పంటలో పురుగులు, తెగుళ్లు విజృంభించాయి. ఎన్నిసార్లు పురుగు మందులు పిచికారి చేసినా చీడపీడల ఉధృతి తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు.మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో పొట్టదశలో ఉన్న వరి పంటలకు బాగా నష్టం వాటిల్లింది. మిగిలిన అరకొర పంటను కాపాడుకుందామనుకొన్న అన్నదాతల ఆశలను చీడపీడలు ఆవిరి చేస్తున్నాయి. పంట చేతికొచ్చే సమయంలో తెగుళ్ల బారిన పడడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో దాదాపు 15 వేల హెక్టార్లకు పైగా వరిపంటను సాగుచేస్తున్నారు. తుఫాన్, మంచు తాకిడిని అధిగమించి సాగుచేసుకొన్న వరి పంట మరో రెండు వారాల్లో చేతికొస్తుందనగా తెగుళ్ల సోకడంతో అన్నదాతలు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. నాలుగు నెలల పాటు పంట సంరక్షణ చేసుకొని గింజలు గట్టిపడుతున్న సమయంలో కంకులు తెల్లగా మారిపోతున్నాయంటున్నారు.వాతావరణ మార్పులతో కాండం తొలిచే పురుగులు వ్యాపించి గింజలు గట్టిపడటం లేదు. దీంతో దిగుబడి బాగా తగ్గిపోయే పరిస్థితి ఏర్పడింది. సూళ్లూరుపేట మండల పరిధిలోని కుదిరి, చెరువుకండ్రిగ, నాదెండ్లవారి కండ్రిగ, పడమటి కండ్రిగ, మంగళంపాడు, మంగానెల్లూరు గ్రామాల్లో పొట్ట దశలో, ఎన్ను దశలో ఉన్న వరి పంట కంకులు బయటకొచ్చి గింజలు గట్టిపడే దశలో ఉన్నాయి. ఈ సమయంలో పంటకు దోమపోటు, మెడవిరుపు తెగుళ్లతో పాటు కాండం తొలిచే పురుగు వ్యాప్తి చెంది కంకి మొదలు నుంచి రసాన్ని పీల్చివేస్తుండడంతో కంకులు జీవం కోల్పోయి తెల్లగా మారిపోతున్నాయి. రైతులు పొలాల్లో పంటను చూసుకొని ఎరువుల దుకాణాల వద్దకు, వ్యవసాయ అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. వారు చెప్పే మందులను పిచికారి చేసినా ఆశించిన ఫలితాలు రాలేదని చెబుతున్నారు.



రసం పీల్చేయడంతో తెల్లగా మారిన వరి కంకులు

గంగమ్మ గుడి పాలకమండలా?.. మాకొద్దు

● ఆసక్తి చూపని వైసీపీ ఆశావహులు



తిరుపతి-ఆంధ్రజ్యోతి : తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయ పాలకమండలి చైర్మన్ కోసం అధికార పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు ఎంతో ఉత్సాహపడుతుంటారు. అలాంటిది వైసీపీ ప్రభుత్వంలో గంగమ్మ ఆలయ పాలకమండలి అంటేనే మాకొద్దు తల్లో..! అంటూ ముఖం చాటేసే పరిస్థితి కనిపిస్తోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు పాలకమండళ్ల నియామకం జరిగింది. 2019 డిసెంబరు 1న సుధాకర్ రెడ్డి నేతృత్వంలో తొలి పాలకమండలి ఏర్పాటైంది. ప్రమాణస్వీకారం చేశారో లేదో కరోనా వ్యాప్తి మొదలైంది. దీంతో గంగజాతరకు బ్రేక్ పడింది. అయినప్పటికీ ఆలయ అభివృద్ధి కోసం గత పాలకమండలి గట్టిగానే ప్రయత్నించింది. ఆలయం చుట్టూ రాతి ప్రహరీ నిర్మాణం కోసం రూ.1.03కోట్ల నిధులు దాతల నుంచి విరాళంగా సేకరించింది. చైర్మన్ చొరవతో నూతన ఆలయ నిర్మాణం కోసం ఎంతో వ్యయప్రయాసలకోర్చి దేవాదాయశాఖ నుంచి అనుమతులు తీసుకొచ్చింది. ఇంతలో గడువు పూర్తికావడంతో మరో ఆరు నెలలు తమకు పొడిగింపు ఇవ్వాలని సుధాకర్ రెడ్డి నేతృత్వంలోని పాలకమండలి సభ్యులు చెంగల్రాజు, తండ్లం మోహన్, జీవరత్నం, గౌరి, ఉష, రాజేశ్వరి, భాగ్యమ్మలు స్థానిక నాయకత్వాన్ని కోరారు. కరోనా వచ్చి జాతర చేయకపోతే తాము చేసేదేమిలేదని, తప్పుకోవాల్సిందేనని ఖరాఖండిగా ముఖంపైనే చెప్పేసినట్టు తెలిసింది. దీంతో వారు మనస్తాపం చెంది పార్టీ వ్యవహారాలకు దూరమయ్యారు. ఆ తర్వాత కట్టా గోపీయాదవ్ చైర్మన్‌గా వెంకటేశ్వరరావు, ధనశేఖర్, రమణమ్మ, హరినాథ్, కృష్ణవేణమ్మ, గీత, భారతి సభ్యులుగా 2022ఫిబ్రవరిలో ప్రమాణ స్వీకారం చేశారు. కానీ పాలకమండలికి ప్రాధాన్యత, ప్రాబల్యం పూర్తిగా తగ్గిపోయాయి. ఆలయంలో వచ్చిన విమర్శలు, ఆరోపణలు మూటకట్టుకోవాల్సి వచ్చింది. అమ్మవారి మూల విరాట్‌ను తొలగించడం, గుడిలో నిధులు గోల్‌మాల్ కావడం వంటివి పాలకమండలికి మాయని మచ్చగా మిగిలాయి. శుక్రవారం నుంచి పాలకమండలి మాజీ కావడంతో కొత్త పాలకవర్గం కోసం దేవాదాయశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. 20 రోజులు లోపు ఎవరైనా దరఖాస్తులు చేసుకోవచ్చు. ఆ తర్వాత స్క్రూట్నీ చేసి అర్హుల జాబితాను సిద్ధం చేయాలి. ఎమ్మెల్యే సిఫారసు మేరకు దేవాదాయశాఖ సభ్యులను నియమిస్తుంది. అయితే ఈతంతు పూర్తయ్యేలోపు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం లేకపోలేదు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే పాలకమండళ్ల నియామకాలు జరగవు. ప్రస్తుతం ఉన్న పాలకమండలికి ఎన్నికలు ముగిసే వరకు గడువు పొడిగించవచ్చు. కానీ అలా చేయకుండా నోటిఫికేషన్ ఇచ్చి ఆశావహులను రాజకీయంగా వాడుకోవాలని స్థానిక నాయకులు భావిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో గంగమ్మ ఆలయ పాలకమండలి వైపు పెద్దగా ఎవరూ ఆసక్తి చూపడంలేదని సమాచారం.

కిక్కిరిసిన తిరుచానూరు ఆలయం



ఆలయం వద్ద భక్తుల రద్దీ - తిరుచ్చిపై ఊరేగుతున్న పద్మావతి దేవి

● పలు సేవల రద్దు

తిరుచానూరు, ఫిబ్రవరి 2: తై మాసం, శుక్రవారం రావడంతో తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు మహిళా భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. తైమాసం కావడంతో మహిళా భక్తులు పసుపుదారాలను మహిళలకు పంచిపెట్టారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయంలో వీఐపీ బ్రేక్, కుంకుమార్చన పలు సేవలను ఆలయ అధికారులు రద్దుచేశారు. మరో రెండు శుక్రవారాలు కూడా తై మాసం ముగిసే వరకు వీఐపీ బ్రేక్, కుంకుమార్చన వంటి సేవలను రద్దు చేస్తామని ఆలయ డిప్యూటీఈవో గోవిందరాజన్ తెలిపారు. ఇక క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు. భక్తులు ఇబ్బంది పడకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. లడ్డు కౌంటర్, నిత్యాన్నదానం, లగేజీ కౌంటర్ వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా కనిపించింది. ఉచిత దర్శనానికి సుమారు గంట సమయం పట్టగా ఇక రూ.200 టిక్కెట్లు కొనుగోలు చేసిన వారికి అరగంట పట్టిందని అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి అమ్మవారి తిరుచ్చిసేవ వైభవంగా జరిగింది.

ఉత్తమ సివిల్ ఇంజనీర్‌గా బాలకృష్ణ



ఐసీఐ, ఆల్ట్రాటెక్ సిమెంటు ప్రతినిధుల నుంచి అవార్డు స్వీకరిస్తున్న బాలకృష్ణ

తిరుచానూరు, ఫిబ్రవరి 2: ఐసీఐ, అల్ట్రాటెక్ సిమెంట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రాత్రి విజయవాడ నోవాటెల్ హోటల్‌లో రాష్ట్రంలోని పలువురు సివిల్ ఇంజనీర్లకు అవార్డులు ప్రదానం చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు గాను తిరుచానూరుకు చెందిన బాలకృష్ణ ఉత్తమ సివిల్ ఇంజ నీరుగా అవార్డు అందుకున్నారు. పలువురు ఆయనను అభినందించారు.

ప్రకృతి వ్యవసాయ కూరగాయల విక్రయం



ప్రకృతి వ్యవసాయ కూరగాయల స్టాల్

రామచంద్రాపురం, ఫిబ్రవరి 2: మండలంలోని నెత్తకుప్పం గ్రామంలో ప్రతి శుక్రవారం జరిగే వారపు సంతలో ప్రకృతి వ్యవసాయంలో పండించే పంటలు, కూరగాయల విక్రయం కోసం ప్రత్యేక స్టాళ్లను జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజరు షణ్ముగం ప్రారంభించారు. ఆకుకూరలు, కూరగాయలతో పాటు తీగజాతి, దుంప జాతి తదితర ఉత్పత్తులను స్టాళ్లు ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విక్రయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పండిన కూరగాయలు, పంటలు ఆరోగ్యం మెరుగుపడటానికి ఎంతో దోహదపడు తాయన్నారు. ఈ పంటలను వారపు సంతల్లో, మండల కేంద్రాల్లో, కలెక్టర్ కార్యాలయంలో విక్రయించ డానికి స్టాల్స్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, ఎస్ఎఫ్‌లు మధు, విమల, ఎంటీలు ఆగమ్మ, సుజాత, ఎల్టు రాజేశ్వరి, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.


అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తాం: టీడీపీ



టీడీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న వినీల్

రామచంద్రాపురం, ఫిబ్రవరి 2: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పులివర్తి నానికి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని పులివర్తి వినీల్ తెలియజేశారు. మండలంలోని అనుపల్లె పంచాయతీలో శుక్రవారం 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎల్ఆర్ కమ్మపల్లి దళితవాడకు చెందిన 30మంది టీడీపీలో చేరారు. వారికి వినీల్ టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు చిన్నబాబు, జనార్ధన్‌చౌదరి, హరిప్రసాద్, జేడీ జగన్, మండల నాయ కులు సురేంద్రనాయుడు, దినేష్ నాయుడు, మాధవయ్య, జయచంద్రనాయుడు, ప్రకాష్, రెడ్డెప్ప నాయుడు, మురళీనాయుడు పాల్గొన్నారు.

మన చంద్రగిరి యాప్ ఆవిష్కరణ



చంద్రగిరి, ఫిబ్రవరి 2: నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిలు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలిపేందుకు మన చంద్రగిరి అనే పేరుతో యాప్‌ను తయారు చేశారు. ఈ యాప్‌ను శుక్రవారం చంద్రగిరి మండలం, ఐతేపల్లెలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, తుడా నిధులతో రూ.950 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, ఐతేపల్లె, అగరాల సర్పంచులు షేక్ ఫజిల్లా, భాస్కర్‌రెడ్డి, ఉపసర్పంచ్ మల్లం రాజశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ దేవరాజులరెడ్డి, వరలక్ష్మి, నాయకులు మస్తాన్ పాల్గొన్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



చంద్రగిరి, ఫిబ్రవరి 2: చంద్రగిరి సీఐగా రామయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతలు పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ రామయ్యకు ఎస్ఐలు హిమబిందు, రవీంద్రనాయక్, ఆర్సీపురం ఎస్ఐ గిరిధర్‌రెడ్డి, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎంపీడీవో బదిలీ



చంద్రగిరి, ఫిబ్రవరి 2: చంద్రగిరి ఎంపీడీవో బాలాజీ నాయక్ నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఎంపీడీవోకు ఘనంగా వీడ్కోలు పలికారు. బాలాజీనాయక్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ శశిరేఖ, సూపరింటెండెంట్ రవిచంద్ర, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.





సమావేశానికి హాజరైన టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులు - మాట్లాడుతున్న పులివర్తి నాని

టీడీపీ పాలనలోనే బీసీల సంక్షేమం : పులివర్తి నాని

పాకాల, ఫిబ్రవరి 2: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ పాలనలో బీసీలకు ప్రాధాన్యత ఇచ్చి వారి సంక్షేమం కోసం కృషి చేశారని చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పులివర్తి నాని అన్నారు. శుక్రవారం పాకాల సమీపంలోని ఊట్లవారిపల్లెలో బీసీ జయహో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పులివర్తి నాని మాట్లాడుతూ చంద్రబాబు బీసీల సంక్షేమం కోసం కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి వృత్తిదారులకు రాయితీతో పనిముట్లు అందజేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్‌లను నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారన్నారు. 2019 ఎన్నికలలో చెవిరెడ్డి భాస్కరరెడ్డి ప్రజలకిచ్చిన హామీలు విస్మరించారన్నారు. యువతకు ఉపాధి కల్పించే శాశ్వత చర్యలు విస్మరించి తాత్కాలికంగా తాయిలాలు పంపిణీ చేస్తున్నారన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే పాకాల మండలం గానుగపెంట సమీపంలోని అమ్మచెరువుకు నీళ్లు తెస్తామని, దామలచెరువు-పాకాల సప్లయ్ ఛానెల్ పనులు పూర్తి చేస్తామని, పాకాల ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటలు డాక్టరు వుండేలా కృషి చేస్తామన్నారు. దామలచెరువులో గార్మెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి కల్పిస్తామని, మ్యాంగో నగర్‌లో మౌలిక వసతులు కల్పించి కోల్డ్ స్టోరేజి ఏర్పాటు చేస్తామన్నారు. నేంద్రగుంట- పెనుమూరు రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరిస్తామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు వలపల దశరథ నాయుడు, సీఆర్ రాజన్, బి.నాగరాజ నాయుడు, ఫల్గుణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మనోహర్, మండల కన్వీనర్ గురునాథ్, కార్యదర్శి నాజర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళను చంపి చెరువు వంకలో పూడ్చేశారు!

● 8నెలల తరువాత బయటపడ్డ హత్యోదంతం

● కారు చోరీ కేసు దర్యాప్తు క్రమంలో వెలుగుచూసిన వైనం ● ఇద్దరు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ యశ్వంత్ - పోలీసుల అదుపులో నరేంద్రనాథ రెడ్డి, ఓబులేశు

చంద్రగిరి, ఫిబ్రవరి 2: ఎనిమిది నెలలక్రితం జరిగిన ఓ మహిళ హత్య కేసును చంద్రగిరి పోలీసులు ఛేదించారు. కారు చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి విచారించగా ఈ విషయం బయటపడింది. శుక్రవారం తిరుపతి జిల్లా చంద్రగిరిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ యశ్వంత్ కేసు వివరాలు వెల్లడించారు. తాడిపత్రికి చెందిన గ్రానైట్ వ్యాపారి నరేంద్రనాథ రెడ్డితో అనంతపురానికి చెందిన జయమ్మ(35) సహజీవనం చేస్తుండేది. వీరికి ఒక కుమారుడు పుట్టాడు. తరువాత నరేంద్రనాథ్ రెడ్డి మరో వివాహం చేసుకుని చంద్రగిరి మండలం బుచ్చినాయుడు పల్లె వద్ద దున్నలు, పొట్టేళ్లు, నాటు కోళ్ల ఫామ్ పెట్టి స్థిరపడ్డాడు.జయమ్మకు పుట్టిన శరణ్‌కుమార్‌రెడ్డిని నరేంద్రనాథ రెడ్డి తన వద్దే ఉంచుకున్నాడు. దీంతో జయమ్మ అపుడప్పుడూ బుచ్చినాయుడుపల్లెకు వచ్చి నరేంద్రనాథరెడ్డి తనను మోసం చేశాడని, తన బిడ్డను కూడా దూరం చేశాడని గొడవ పెట్టుకునేది.ఈ నేపథ్యంలో గత సంవత్సరం మే 25వ తేదిన నరేంద్రనాథరెడ్డిని ఫారం వద్దకు వచ్చిన జయమ్మ నిలదీస్తుండగా అతడి వద్ద పనిచేస్తున్న ఓబులేశు పికాసితో ఆమె తలపై కొట్టాడు.దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అదేరోజు రాత్రి జయమ్మ మృతదేహాన్ని నరేంద్రనాథరెడ్డి తన కారులో వేసుకుని ఓబులేశు, తన వద్ద పనిచేసే అప్పారావు, రఘుపతిరాజులతో కలిసి అన్నమయ్య జిల్లా రాజంపేట వద్ద చెయ్యేరు చెరువు వంకలో పూడ్చిపెట్టారు.పది రోజుల క్రితం నరేంద్రనాథరెడ్డి తన కారు చోరీ అయిందని చంద్రగిరి స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.ఈ కేసు దర్యాప్తులో భాగంగా కారు చోరీ చేసిన అప్పారావును పోలీసులు అరెస్ట్ చేసి విచారించారు. దీంతో జయమ్మ హత్య వెలుగులోకి వచ్చింది. జయమ్మను హత్య చేస్తే ఒక్కొక్కరికి రూ.5 లక్షలు ఇస్తానని నరేంద్రనాథరెడ్డి హామీ ఇచ్చాడు. అయితే డబ్బులు ఇవ్వకపోవడంతో కారు చోరీ చేసినట్లు అప్పారావు ఒప్పుకున్నాడు. కాగా జయమ్మ కనిపించడంలేదంటూ ఆమె సోదరుడు దేవేంద్ర అనంతపురం నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పారావు ఇచ్చిన సమాచారం మేరకు చంద్రగిరి పోలీసులు శుక్రవారం కళ్యాణి డ్యామ్ వద్ద నరేంద్రనాథరెడ్డి, ఓబులేశులను అరెస్ట్ చేశారు. రఘుపతిరాజు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. అరెస్ట్ అయిన నిందితులను కోర్టుకు తరలించారు.

కేసు ఛేదించిన బృందానికి రివార్డు

కారు చోరీ కేసుతోపాటు జయమ్మ హత్య కేసును ఛేదించిన డీఎస్పీ యశ్వంత్, సీఐ రాజశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ బాలకృష్ణ, కానిస్టేబుళ్లు జాకీర్ హుస్సేన్, కార్తీక్, మునిరత్నం, గోపి, వేణుగోపాల్, అన్వర్‌బాషాలను ఎస్పీ పరమేశ్వరెడ్డి అభినందించి రివార్డులతో సత్కరించారు.

తిరుమల డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



తిరుమల, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమల డీఎస్పీగా కె.శ్రీనివాసాచారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో డీఎస్పీగా ఉన్న భాస్కర్‌రెడ్డి తిరుపతి ఎస్బీకి బదిలీ అయ్యారు. శ్రీనివాసాచారిని డీఎస్పీగా నియమించడంతో ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో టీటీడీ విజిలెన్స్ విభాగంలో పనిచేసేన అనుభవంతో టీటీడీ ఉన్నతాధికారులను సమన్వయం చేసుకుంటూ శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహిస్తానన్నారు. నూతన డీఎస్పీకి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

గోడ కూలి బాలిక మృతి



హెమాన్ని (ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, ఫిబ్రవరి 2: చంద్రగిరి మండలం ఎం.కొంగరవారి పల్లె వద్ద జగనన్న కాలనీలో శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో పనులు చేపడుతుండగా ప్రమాదవశాత్తు గోడ కూలి ఆరేళ్ల బాలిక మృతి చెందింది. ఎం.కొంగరవారిపల్లె వద్ద జగనన్న కాలనీలో పనిచేయడానికి మధ్యప్రదేశ్ నుంచి కూలీలు వచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం జగనన్న కాలనీలో ఎక్స్‌కవేటర్‌తో పనులు చేస్తుండగా గోడ కూలిపోయింది. అయితే గోడ కింద ఉన్న కూలీ సురేష్, నిర్మల దంపతుల కుమార్తె హెమాన్ని(6)కి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో హెమాన్నిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హెమాన్ని మృతి చెందింది. చంద్రగిరి పోలీసులు కేసు విచారిస్తున్నారు.

రేపు ఉచిత వైద్య మెగా శిబిరం

పాకాల, ఫిబ్రవరి 2: దామలచెరువులోని మ్యాంగో నగర్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని కోడలు, ప్రముఖ చిన్న పిల్లల వైద్యురాలు పులివర్తి త్రిష్యరెడ్డి ప్రత్యేక చిన్న పిల్లల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దామలచెరువు, పరిసర గ్రామాల ప్రజలు ఈవైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయకులు కోరారు.

తల్లిని వదిలించుకున్నాడు..

● వారం రోజులుగా అలిపిరి బస్టాండులో దయనీయ స్థితిలో వృద్ధురాలు



కొడుకు వదిలివెళ్లిన వృద్ధురాలు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 2 : తమిళనాడు రాష్ట్రానికి చెందిన 75 ఏళ్ల పైబడిన ఓ వృద్ధురాలిని కన్న కొడుకు శ్రీవారి దర్శనం పేరు చెప్పి తిరుపతికి తీసుకు వచ్చి అలిపిరి బస్టాండులో విడిచి వెళ్లిన ఘటన చోటుచేసుకుంది. నడవలేక, కనీసం మాట్లాడలేక వారం రోజులుగా అలిపిరి బస్టాండులో ఎండకు, చలికి ఇబ్బందిపడుతోంది. దాతలు ఎవరైనా భోజనం అందిస్తే తిని కొడుకు వస్తాడనే ఆశతో ఎదురుచూస్తోంది. మూడు రోజుల కిందట ఆ వృద్ధురాలిని గమనించిన సామాజిక కార్యకర్త సుజాత అక్కున చేర్చుకుంది. సపర్యలు చేసి, ఆమె కుటుంబ సభ్యుల వివరాలు సేకరించే ప్రయత్నం చేస్తోంది. తన పేరు సరస్వతి అని, కొడుకు ఇక్కడ వదిలేసి వెళ్లిపోయాడని తమిళంలో చెప్పగలిగింది. వృద్ధాశ్రమంలో చేర్పించేందుకు ప్రయత్నం చేయగా వివరాలు లేదా ఆధార్ కార్డు ఉంటేనే చేర్చుకుంటామని చెప్పడంతో సుజాత తన వద్దనే ఉంచుకుని సంరక్షిస్తోంది.

మామిడి తోటల పరిశీలన



గంగుడుపల్లెలో మామిడితోటను పరిశీలిస్తున్న దృశం

చంద్రగిరి/పాకాల, ఫిబ్రవరి 2: చంద్రగిరి, పాకాల మండలాల్లోని గంగడుపల్లె, దామలచెరువు పంచాయతీల్లోని మామిడి తోటలను జిల్లా ఉద్యానవన అధికారి దశరథరామిరెడ్డి, చీనీ, నిమ్మ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నాగరాజు, ఉద్యానవన అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ ఏడాది మామిడిలో పూత ఆలస్యంగా రావడానికి వాతావరణంలో మార్పులు, డిసెంబరులో కురిసిన వర్షాలు కారణమని తెలిపారు. ఉద్యానవన అధికారుల సూచనలతో మామిడి తోటలలో తగిన పిచికారి చేస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి శైలజ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

భాకరాపేట సీఐగా మస్తాన్ వల్లి



భాకరాపేట, ఫిబ్రవరి 2: భాకరాపేట సీఐగా మస్తాన్‌వల్లి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సురేందర్ రెడ్డి బదిలీపై వెళ్లడంతో అనంతపురం నుంచి బదిలీపై భాకరాపేటకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడేందుకు కృషి చేస్తానన్నారు. వివిధ సమస్యలపై పోలీసు స్టేషన్‌కు వచ్చే వారి సమస్యలు సత్వరం పరిష్కరిస్తామన్నారు.

హౌస్ సైట్స్ రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 2: హౌస్ సైట్స్ రిజిస్ట్రేషన్లు శనివారం నుంచి క్యాంపెయిన్ మోడ్‌లో ప్రారంభం కావాలని, అలాగే ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్‌భారత్ కార్డులను రెండు రోజుల్లో లబ్ధిదారులకు పంపిణీ చేయాలని కలెక్టర్ లక్ష్మీశా అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, డీఎంహెచ్‌వో శ్రీహరి, ఎంపీడీవో, తహసీల్దారులతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సమన్వయం చేసుకుని హౌస్ సైట్స్ రిజిస్ట్రేషన్ వందశాతం పూర్తి చేయాలన్నారు. జిల్లాకు వచ్చిన నాలుగు లక్షలకు పైగా ఆరోగ్యశ్రీ కార్డులను ఈకేవైసీ చేసి పంపిణీ చేయాలన్నారు.

స్విమ్స్‌లో సైంటిస్టు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 2 : స్విమ్స్ యూనివర్సిటీలోని వైరాలజీ విభాగంలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసేందుకు సైంటిస్టు-సి(మెడికల్) పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్విమ్స్ రిజిస్ట్రార్ అపర్ణబిట్ల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 5వ తేదీలోపు పూర్తి చేసిన దరఖాస్తుతోపాటు అన్ని సర్టిఫికెట్స్‌ను పోస్టు ద్వారా లేదా మెయిల్ ద్వారా పంపించాలని కోరారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 2: నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ వాసుదేవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసం 33/11 కె.వి. సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. డీబీఆర్ రోడ్డు, ఎస్టీ కాలనీ, చింతలచేను, లీలామహల్ సర్కిల్, సుబ్బారెడ్డి నగర్, కొత్తపల్లి ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఆర్కాట్ కృష్ణప్రసాద్

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 2: లైన్స్‌క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ ఆధ్వర్యంలో ఆర్కాట్ కృష్ణప్రసాద్, కోలా లక్ష్మీపతి పట్నాలు వీధిలోని నిరాశ్రయుల కేంద్రంలో శుక్రవారం దుప్పట్లు, దుస్తులు అందించారు. లక్ష్మీపతి తల్లి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ సురేష్, రోహిత్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పొరబాట్లు రాకూడదు

- కమిషనర్ అదితి సింగ్ -



తిరుపతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఓటరు జాబితాలో ఎలాంటి పొరబాట్లూ రాకూడదని తిరుపతి నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కమిషనర్ అదితి సింగ్ తెలిపారు. కచ్చపి ఆడిటోరియంలో శుక్రవారం బూత్ లెవల్, సెక్టోరల్ ఆఫీసర్లతో ఆమె సమావేశమయ్యారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించకూడదన్నారు. ఓటరు జాబితాను మరింత క్షుణ్ణంగా పరిశీలించాలని, మృతి చెందిన వారి ఓట్లు తొలగించేటప్పుడు డెత్ సర్టిఫికెట్ తీసుకున్నారా? లేదా? అని చూడాలన్నారు. కొత్త ఓట్లను నమోదు చేసేటప్పుడు ఎన్నికల నిబంధనలను పాటించాలన్నారు. అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, డీసీ అమరయ్య, ఎస్ఈ మోహన్, ఆర్వో సేతుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

● పరిశుభ్రతకే ప్రాధాన్యం

తిరుపతిలో పరిశుభ్రతకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ అదితి సింగ్ తెలిపారు. శుక్రవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో నగరంలో పలు చోట్ల పారిశుధ్య సిబ్బంది, డ్రైవర్ల మస్టర్ పాయింట్ల వద్ద హాజరు పట్టికను పరిశీలించారు. రోడ్ల పక్కన చెత్తనిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తడి, పొడి చెత్తలను వేరుచేసే విధానాన్ని పరిశీలించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

రిలీవైన 30 మంది తహసీల్దార్లు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 2 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో 3 సంవత్సరాల పైబడి పనిచేసినవారిని ఇతర జిల్లాలకు బదిలీ చేస్తు రెండు రోజుల క్రితం ఉత్తర్వులు వచ్చాయి. అందులో బాగంగా బదిలీ అయిన తహసీల్దార్లు తమ బాధ్యతలను ఆయా మండలాల్లోని డిప్యూటీ తహసీల్దార్లకు అప్పగించి రిలీవ్ కావాలని కలెక్టర్ లక్ష్మీశ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 11మంది కడప జిల్లాకు కేటాయించారు. ఏడుగురు అనంతపురానికి, ఐదుగురు ప్రకాశం జిల్లాకు, ఇద్దరు నంద్యాలకు, ఒక్కొక్కరు పల్నాడు, బాపట్ల, గుంటూరు, అన్నమయ్య, కర్నూలుకు కేటాయించారు. జిల్లాకు నూతనంగా కేటాయించిన తహసీల్దార్లు శని వారం, సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

6న సర్పంచుల చలో అసెంబ్లీ

తిరుపతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఏపీ పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 6న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేయడం, పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించడంతో పాటు పలు సమస్యల పరిష్కారానికి అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చినట్టు పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా జిల్లాలోని సర్పంచులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

భువనేశ్వరిని కలిసిన తిరుపతి నేతలు



భువనేశ్వరితో నరసింహ యాదవ్

తిరుపతి, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి) : వెంకటగిరి నియోజకవర్గం పర్యటనకు వచ్చిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని పలువురు తిరుపతి నేతలు కలిశారు. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహా యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష తదితరులు ఉన్నారు.

యువత వివేకానంద బోధనలు చదవాలి

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 2: యువత స్వామి వివేకానంద బోధనలు చదవాలని, మంచి పౌరులుగా ఎదగడానికి అవి ఉపకరిస్తాయని సుకృతానంద అన్నారు. శుక్రవారం రామకృష్ణ ఆశ్రమంలో వివేకానంద జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశానికి శక్తివంతమైన సమాజం అవసరమన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు నందన్ భట్ వివేకానందుని సేవాయోగం అనే అంశంపై ప్రసంగించారు. ఉదయం 5 గంటల నుంచి ఆశ్రమంలో పూజలు, భజనలు, ధ్యానం, సంకీర్తనలు, ప్రత్యేక హోమం నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర వైద్య కళాశాల వద్ద ఉన్న వివేకానందుడి శిలా విగ్రహానికి ఆశ్రమం తరపున సుకృతానంద పూల మాల వేసి, నివాళి అర్పించారు. స్వస్థానంద పాల్గొన్నారు.

జిల్లా ప్రగతిపై కలెక్టర్ సమీక్ష

తిరుపతి (కలెక్టరేట్), ఫిబ్రవరి 2: జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ లక్ష్మీశా శుక్రవారం అధికారులతో సమీక్షించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో విద్య, గృహ నిర్మాణం, నాడు-నేడు, ఆదర్శ పాఠశాలలు, సర్వశిక్ష అభియాన్ అమలు తీరుపై శాఖల వారీగా చర్చించారు. బడిఈడు పిల్లలు బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన 74,706 గృహాల్లో ఇప్పటివరకు 27,240 పూర్తయ్యాయని, మిగిలిన 73 శాతం వివిధ దశల్లో ఉన్నాయని జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటేశ్వరరావు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. డీఈవో శేఖర్, సుశీలాదేవి, జయలక్ష్మి, శివశంకర్, ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

విద్యాశాఖ ఏసీ బాధ్యతల స్వీకారం


గురుస్వామిరెడ్డిని అభినందిస్తున్న అపుస్మా నాయకులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 2: జిల్లా విద్యాశాఖ నూతన అసిస్టెంట్ కమిషనర్‌గా(ఏసీ) నియమితులైన పి.గురుస్వామిరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఏపీ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా)జిల్లా సంఘ ఆధ్వర్యంలో పలు ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్లు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. నాయకులు ఓబుల వెంకటరమణారెడ్డి, ఎం.హరినాథ్‌శర్మ, బి.రవీంద్రారెడ్డి, జె.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, రఘునారాయణ, వి.భాస్కర్‌రెడ్డి, సంగరాజు భాస్కర్‌రాజు, రమణ, రెడ్డి శ్రీధర్‌రెడ్డి, సురేంద్రారెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొని సత్కరించారు.

తడ కేజీబీవీలో మ్యాథ్స్ గెస్ట్ ఫ్యాకల్టీకి సంప్రదించండి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 2: తడ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మ్యాథ్స్ సబ్జెక్టును బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ అవసరముందని డీఈవో డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. ఎమ్మెస్సీ (మ్యాథ్స్) విద్యార్హత ఉన్న అభ్యర్థులు ప్రిన్సిపాల్ ఫోన్ నెంబరు 9052156838 లేదా 9441863994ను సంప్రదించాలని కోరారు.

వొలికలబీడుకు జయప్రద పురస్కారం

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 2 : తిరుపతికి చెందిన ప్రముఖ కథ, నవలా రచయిత, విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ రాసాని ఇటీవల ప్రచురించిన వొలికలబీడు నవలకు డాక్టర్ జయప్రద నవలా పురస్కారం ప్రకటించారు. ఈనెల 18వ తేదీన నెల్లూరులో జరిగే కార్యక్రమంలో పురస్కారం అందజేస్తారని పెన్నా రచయితల సంఘం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సభలో ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్, ప్రముఖ కవి పెరుగు రామకృష్ణ పాల్గొంటారని పేర్కొంది.

రిమ్స్‌లో టెక్నో అండ్ గ్యాబ్‌ఫెస్ట్


మాట్లాడుతున్న రిమ్స్ ప్రిన్సిపాల్ జె.ప్రకాశ్‌రెడ్డి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 2: బైరాగిపట్టెడలోని కొండారెడ్డి రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ (కంప్యూటర్‌సైన్స్) విద్యార్థులకు టెక్నో అండ్ గ్యాబ్ ఫెస్టివల్ శుక్రవారం ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డితో హెచ్‌వోడీలు పి.నిరంజన్‌రెడ్డి, పి.మధుర కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డేటా అనాలసిస్, వెబ్ డిజైన్, ఎర్రర్ డిటెక్షన్, పేపర్ అండ్ పోస్టర్ ప్రజంటేషన్, గ్రూప్ డిస్కషన్, యంగ్ మేనేజర్, హెచ్‌ఆర్, మార్కెటింగ్ మంత్ర, ఫైనాన్స్ గేమ్, బిజినెస్ ప్లాన్ వంటి అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేస్తామని ప్రిన్సిపాల్ వివరించారు. ఛైర్మన్ వై.కొండారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ వై.ఆనందరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ వై.విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

రథసప్తమికి విస్తృత ఏర్పాట్లు



తిరుమల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16వ తేదీన రథసప్తమికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ లేకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం టీటీడీ అధికారులు, పోలీసు అధికారులతో ఈవో సమీక్షించారు. అన్నప్రసాదం, ఆరోగ్యశాఖ, ఇంజినీరింగ్, ఆలయం, గార్డెన్, శ్రీవారిసేవ, భద్రత, ఎస్వీబీసీ, ధర్మప్రచార పరిషత్ తదితర విభాగాల అధికారులకు సూచనలు చేశారు.

ప్రత్యేక దర్శనాలు రద్దు: రథసప్తమికి వచ్చే రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్జిత సేవలను రద్దు చేసినట్టు ఈవో తెలిపారు. ఆ రోజున ఎలాంటి ప్రత్యేక దర్శనాలు ఉండవన్నారు. వీఐపీ బ్రేక్‌తో పాటు వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల దర్శనాలను రద్దు చేశామన్నారు. 14వ తేదీ తెల్లవారుజాము 12 నుంచి 16వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు టీబీ, ఎంబీసీ-34 కౌంటర్లను మూసివేసి కేవలం సీఆర్వో, పద్మావతి కౌంటర్లలో మాత్రమే గదులు కేటాయిస్తామన్నారు. 15, 16, 17 తేదీల్లో ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీని రద్దు చేశామన్నారు.

జూనియర్ సివిల్ జడ్జికి సన్మానం



తిరుపతి(లీగల్), ఫిబ్రవరి 2: తిరుపతి కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్న పి.ప్రశాంత్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన నేపథ్యంలో తిరుపతి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈయన గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏపీపీగా పనిచేసిన పి.శ్రీనాథ్ కుమారుడు. హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్, తిరుపతి అనంత లా కాలేజీలో ఎల్ఎల్బీ పూర్తి చేశారు. తండ్రీకుమారులను సీనియర్ న్యాయవాది నెల్లూరు యోగానంద్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పి.రమణ, మురళి, చల్లా వెంకటయ్య, మునెయ్య, వెంకటరత్నం, గాజుల కృష్ణయ్య, చంద్రయ్య, హరీష్, రమేష్, నరసింహ, ఆషా, రెహానా, మంజుల, వరలక్ష్మి, సుమన్, నారాయణ పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో అదుపుతప్పిన కారు



తిరుమల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో శుక్రవారం ఓ కారు అదుపుతప్పింది. భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చెన్నైకి చెందిన ఓ కుటుంబం శ్రీవారి దర్శనం ముగించుకుని శుక్రవారం సాయంత్రం తమ టీఎన్ 06 ఎం 7680 నెంబరు గల కారులో తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంలోని చివరి మలుపు వద్ద కారు అదుపుతప్పింది. కుడివైపునున్న చిన్న కాలువలోకి దూసుకుపోయింది. కారులోని ముగ్గురు భక్తులు చిన్నపాటి గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం ప్రమాదానికి గురైన కారును టీటీడీ ఆటోక్లినిక్ సిబ్బంది ఘటనా ప్రాంతం నుంచి అలిపిరికి తరలించారు.

తిరుమలలో పారిశుధ్య కార్మికుడి మృతి


విజయ్‌కుమార్ మృతదేహం

తిరుమల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : తిరుమల హెల్త్ విభాగంలో పనిచేసే ఓ పారిశుధ్య కార్మికుడు శుక్రవారం మృతిచెందాడు. చంద్రగిరికి చెందిన విజయ్‌కుమార్(53) కొన్నేళ్లుగా తిరుమలలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం గురూజీ సంస్థ నుంచి హెల్త్ విభాగంలోని మలేరియా డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన ఎప్పటిలానే శుక్రవారం ఉదయం తిరుమలకు వచ్చాడు. అయితే ఆరోగ్యం సరిగా లేదని విధులకు హాజరుకాలేదు. మధ్యాహ్నం ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో గుర్తించిన స్థానికులు వెంటనే స్థానిక అశ్విని ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. తోటి ఉద్యోగులు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ అంశంపై సీఐటీయు నాయకుడు సుబ్రహ్మణ్యం స్పందిస్తూ విజయ్‌కుమార్ కుటుంబానికి రూ.10 లక్షలు టీటీడీ చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.44 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి):తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.44కోట్లు లభించింది.బుధవారం ఉదయంనుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 57,233 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 18,015 మంది తలనీలాలు సమర్పించారు.

టీటీడీ ట్రస్టులకు రూ.21 లక్షల విరాళం

తిరుమల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): టీటీడీలోని పలు ట్రస్టులకు శుక్రవారం రూ.21 లక్షలు విరాళంగా అందింది. ఢిల్లీకి చెందిన రమా సివిల్ ఇండియా కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.11 లక్షలు, భువనేశ్వర్‌కు చెందిన శివం కాండెన్ ప్రైవేట్ లిమిడెట్ సంస్థ ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించాయి. ఈ మేరకు ఆ సంస్థల ప్రతినిధి తిరుపతికి చెందిన రాఘవేంద్ర చెక్‌లను తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం టీటీడీ ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

37మందికి జరిమానా

తిరుపతి(లీగల్), ఫిబ్రవరి 2: తిరుమలలో పలు నేరాలకు పాల్పడిన 37మందికి రూ.26,400 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి, తిరుమల క్యాంపు కోర్టు ఇన్‌ఛార్జ్ న్యాయమూర్తి పి.కోటీశ్వరరావు తీర్పు చెప్పారు. తిరుమల వన్‌టౌన్, టూటౌన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వివిధ నేరాలకు పాల్పడిన 37మందిని అదుపులోకి తీసుకుని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. నేరం అంగీకరించడంతో జరిమానా విధించి విడిచిపెట్టారు.

ఐఏఎస్‌ల తీరు బాధాకరం

టీడీపీ, జనసేన


సమావేశంలో మాట్లాడుతున్న వూకా విజయకుమార్, కిరణ్ రాయల్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 2: చేసిన తప్పులకు ఇప్పటికే కొందరు ఐఏఎస్‌లు శిక్ష అనుభవిస్తున్నా కొత్తగా వచ్చిన వారిలో ఏ మాత్రమూ మార్పు కనిపించకపోవడం బాధాకరమని టీడీపీ, జనసేన నాయకులు విమర్శించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో టీడీపీ నాయకుడు వూకా విజయకుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ మాట్లాడుతూ జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ లక్ష్మీశా, నగరపాలక సంస్థ కమిషర్ అదితి సింగ్ స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఇంటికెళ్లి సన్మానాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కుమారుడు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తుండడం, మరికొన్ని రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ ఇద్దరు ఐఏఎస్‌ల తీరు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈసీ దీనిపై ప్రత్యేక దృష్టి సారించి, ఆ ఇద్దరు అధికారులను రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అధికార పార్టీకి తగినట్లుగా అధికారుల బదిలీలు జరిగాయని ఆరోపించారు. తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో జరుగుతున్న అవకతవకల వల్ల ప్రజాస్వామ్యంపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారన్నారు.

కలెక్టర్‌ను ఈసీ రీకాల్ చేయాలి

జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ లక్ష్మీశాను ఈసీ రీకాల్ చేయాలని టీడీపీ తిరుపతి నగర అధ్యక్షుడు చిన్నబాబు డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ కలెక్టర్ స్థాయిలో ఉన్న వ్యక్తి తిరుపతి ఎమ్మెల్యే ఇంటికెళ్లి కలవడం, సన్మానం చేయడం దారుణమన్నారు. కలెక్టర్‌ను కేంద్ర ఎన్నికల సంఘం రీకాల్ చేసి ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలన్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డిని ఒంగోలుకు మార్చడం అక్కడ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి అనుకూలంగా వ్యవహరించేందుకేనని ఆరోపించారు. వైసీపీకి విధేయుడిగా ఉంటున్న తిరుచానూరు సీఐ శివప్రసాద్‌రెడ్డిని తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేయడం కూడా అలాంటిదేనన్నారు. తిరుమల వన్‌టౌన్ సీఐ జగన్‌మోహన్‌రెడ్డిని డీటీసీగా బదిలీ చేశారన్నారు. టీడీపీ నాయకులు రాజేంద్రప్రసాద్, స్రవంతి, చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ నమోదు, తొలగింపుల్లో
ఈఆర్వోలు బాధ్యతగా వ్యవహరించాలి

- ఎన్నికల సంఘం సూచనలు తప్పనిసరిగా పాటించాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ లక్ష్మీశా


వీడియో కాన్ఫరెన్సుకు హాజరైన కలెక్టర్ లక్ష్మీశా

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 2: ఎలక్టోరల్ నమోదు, తొలగింపులపై ఎలాంటి తప్పిదాలూ జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం ఆదేశాలు, నిబంధనలు అనుసరించాలని, ఈ విషయంలో ఈఆర్వోలు పూర్తి బాధ్యత తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్సు హాల్ నుంచి జేసీ శుభం బన్సల్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్, డీఆర్వో పెంచలకిషోర్, ఈఆర్వోలతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. సమావేశం అనంతరం కలెక్టర్ ఈఆర్వోలకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సంఘం నూతన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. హ్యాండ్ బుక్‌లోని నిబంధనలు, మార్గదర్శకాలను తప్పక అనుసరించాలని సూచించారు. త్వరితగతిన ఓటరు పెండింగ్ అభ్యంతరాలను, పొరబాట్లను సవరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వోలు కోదండరామిరెడ్డి, నిషాంత్‌రెడ్డి, చంద్రముని, రవిశంకర్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు చంద్రశేఖర్‌నాయుడు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు, ఎన్నికల తహసీల్దారు చంద్రశేఖర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో వాహనాల వేగాన్ని నియంత్రించండి

డయల్ యువర్ ఈవోలో భక్తులు

తిరుమల, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై భక్తులు సంచరిస్తున్న ప్రదేశాల్లో కొన్ని ప్రైవేట్ వాహనాలు స్పీడ్‌గా వెళుతున్నాయని, వేగాన్ని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని విజయవాడకు చెందిన శ్రీనివాసరావు, ప్రైవేట్ హోటళ్ల నిర్వాహకులు భక్తులు తిరిగే ప్రదేశంలో స్టౌ పెట్టి వంట చేస్తున్నారని, ఇది ప్రమాదకరమని వైజాగ్‌కు చెందిన అప్పన్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈవో స్పందిస్తూ ప్రైవేట్ వాహన డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. తిరుమలలో అగ్నిప్రమాదాల నివారణకు సిలిండర్ల వినియోగాన్ని రద్దుచేసి, ఎల్‌జీ పైప్‌లైన్ ద్వారా గ్యాస్‌ను సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం నిర్వహించారు. శ్రీవారిమెట్టు మార్గంలో భక్తులు టోకెన్లు తీసుకుని తిరిగి రోడ్డుమార్గంలో తిరుమలకు వెళుతున్నారని, నడిచే భక్తులకు మాత్రమే టోకెన్లు ఇవ్వాలని సునీల్(సూర్యాపేట్) తెలుపగా ఈవో బదులిస్తూ చాలామంది భక్తులు టోకెన్ల కోసమే నడకమార్గాల్లో తిరుమలకు వస్తున్నారన్నారు. భక్తులు క్యూలో ఎండకు, వానకు, చలికి ఇబ్బంది పడుతున్నారని, మరో క్యూకాంప్లెక్స్‌ను నిర్మించాలని ఆనంద్(కర్నాటక) కోరారు. భక్తులు క్యూలో వేచి ఉండకుండా టైంస్లాట్ విధానాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఈవో సమాధానమిచ్చారు. టీటీడీ సాహిత్యం, పురాణాల పుస్తకాలు లభించడం లేదని శర్మ(విశాఖపట్నం) ఈవో దృష్టికి తీసుకురాగా టీటీడీ పుస్తక ప్రచురణ అఖండంగా సాగుతోందన్నారు. ఎస్వీబీసీలో కార్యక్రమాల మార్పు సమయాన్ని ముందుగా తెలియాలని హిమకర్(విజయవాడ) కోరగా, తప్పకుండా తెలియజేస్తామని ఈవో తెలిపారు.

డీఎస్పీ మురళీధర్ సేవలు అభినందనీయం


డీఎస్పీ మురళీధర్‌ను సన్మానిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 2: శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమంగా తరలిపోకుండా టాస్క్‌ఫోర్సు డీఎస్పీ మురళీధర్ మంచి కార్యాచరణతో పనిచేశారని టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ అన్నారు. డీఎస్పీ మురళీధర్ బదిలీపై వెళుతుండడంతో శుక్రవారం టాస్క్‌ఫోర్సు కార్యాలయ ఆవరణలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ మురళీధర్ టాస్క్‌ఫోర్సుకు వచ్చాక పలు సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుడి చెంత టాస్క్‌ఫోర్సులో పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు, ఆర్ఐలు సురేష్‌కుమార్‌రెడ్డి, కృపానంద, చిరంజీవులు, సీఐలు శ్రీనివాస్, సురేష్‌కుమార్, ఏసీఎఫ్ శ్రీనివాసరావు, అడ్మిన్ ఆఫీసర్ రవిశంకర్, తిరుపతి, రైల్వేకోడూరు, కడప ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

చేనేత వస్త్ర, హస్త కళలను ఆదరించండి


చేనేత వస్త్ర, హస్తకళల ప్రదర్శనను ప్రారంభిస్తున్న మేయర్

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 2: భారతీయ సంస్కృతికి, సంప్రదాయానికి దర్పణం పట్టే చేనేత వస్త్ర, హస్త కళలను ప్రజలు ఆదరించి, మరింత ప్రోత్సహించాలని మేయర్ డాక్టర్ శిరీష కోరారు. భావనారుషి చేనేత హస్తకళ కార్మిక సేవా సమితి సొసైటీ ఆధ్వర్యంలో త్యాగరాజ మండపంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలను శుక్రవారం సాయంత్రం మేయర్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ భారతీయ సంపదైన చేనేత, హస్తకళ రూపాలు కనుమరుగవుతున్న నేపథ్యంలో కళాకారులను మరింత ప్రోత్సాహిస్తూ ఈ ప్రదర్శనను అందుబాటు లోకి తేవడం అభినందనీయమన్నారు. నగర ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్వాహకులు సింహాద్రి, సురేష్ మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుం దన్నారు. చేనేత కార్మికులు తమ వస్త్రాలను సరసమైన ధరలకు విక్రయిస్తున్నారన్నారు. పోచంపల్లి, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కాటన్ వస్త్రాలతో పాటు జైపూర్ బెడ్‌షీట్, ఖాది షర్ట్స్, అన్ని రకాల వస్త్రాలు లభిస్తాయన్నారు.

విశ్వనాథ్‌కు ఘన నివాళి


నివాళి అర్పిస్తున్న గుండాల గోపినాథ్

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 2: ప్రముఖ సినీ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. జీఎస్ మాడవీధిలోని రంగస్థలి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన పలు చిత్రాలు మానవీయ విలువలను పెంచాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శాంబోల హరినాథ్, రవిప్రసాద్, సుబ్రహ్మణ్యంరెడ్డి, జయంత్‌కుమార్, మురళీకృష్ణ, గణేష్, బాలాజీ, చంద్రబాబు, రాహుల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవం

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 2: శ్రీవెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో శుక్రవారం ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. 50మంది విద్యార్థులు పాల్గొన్నారు. జూ క్యూరేటర్ సెల్వం విద్యార్థులకు చిత్తడి నేలల ప్రాముఖ్యత, వాటి ఆవశ్యకతను వివరించారు.

ఘనంగా ఆపస్ ఆవిర్భావ దినోత్సవం

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 2: ఏపీ ఉపాధ్యాయ సంఘ(ఆపస్) ఆవిర్భావ దినోత్సవాన్ని బైరాగిపట్టెడలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీతో జిల్లా ప్రధాన కార్యదర్శి గట్ల సాంబిరెడ్డి కలసి పతాకావిష్కరణ చేశారు. బాలాజీ మాట్లాడుతూ విద్యావ్యవస్థల్లో టీచర్లు, విద్యార్థులకు వెన్నుదన్నుగా ఉంటూ దశాబ్దాలుగా విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం చేయడంలో ముందంజలో ఉండడం సంతోషంగా ఉందన్నారు. టీచర్ల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేస్తామని సంఘ నాయకులతో కలసి ప్రతిజ్ఞ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాజులు, మాండవ్య, జయశంకర్, విజయసింహారెడ్డి పాల్గొన్నారు.

స్విమ్స్‌లో అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతం

తిరుమల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్ ఆస్పత్రిలో జనవరి 18వ తేదీన గుండె, లివర్, కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను వైద్యులు ఏకకాలంలో విజయవంతంగా నిర్వహించారని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం, సామనత్తం గ్రామానికి చెందిన గొల్లపల్లి హేమకుమార్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్‌డెడ్ కావడంతో అతని తల్లిదండ్రులు మానవతాదృక్పథంతో అవయవదానానికి ముందుకు వచ్చారన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్విమ్స్ ఆస్పత్రిలో అవయవ మార్పిడికి అవసరమైన అధునాతన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. శ్రీపద్మావతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛైల్డ్ హెల్త్ పేరిట చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా తీర్చిదిద్దనున్నామన్నారు. టీటీడీ ఆధ్వర్యంలోని డిగ్రీ కళాశాలలకు అటానమస్ హోదా లభించిన నేపథ్యంలో స్వతహాగా నిర్ణయాలు తీసుకునే అవకాశం లభించిందన్నారు. భక్తులు నకిలీ వెబ్‌సైట్ల కారణంగా మోసపోకుండా టీటీడీ ఐటీ విభాగం 52 నకిలీ వెబ్‌సైట్లను, 13 నకిలీ మొబైల్ యాప్‌లను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు.

మధ్యంతర బడ్జెట్‌పై అవగాహన

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 2: పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్ఎస్ఐ)తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో న్యూబాలాజీ కాలనీలోని గ్రీన్‌హోం డెవలపర్స్ కార్యాలయంలో శుక్రవారం మధ్యంతర బడ్జెట్-2024పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం జర్నలిజం ప్రొఫెసర్ ఆచార్య సి.వాణి, చార్టెడ్ అకౌంటెంట్ వి.భాగ్యతేజ హాజరై అవగాహన కల్పించారు. అనంతరం ఇటీవల జాతీయ అవార్డులు పొందిన పీఆర్ఎస్ఐ సభ్యులు రమాకాంతశర్మ, ఆచార్య త్రిపురసుందరి, ఎన్.బి.హర్షవర్ధన్‌రెడ్డిలను సంస్థ ఛైర్మన్ కె.శ్రీనివాసరావు, కార్యదర్శి డి.చంద్రమోహన్, ఇతర సభ్యులు సన్మానించారు. ఆచార్య చక్రవర్తి రాఘవన్, సాయికుమార్‌రెడ్డి, ఆర్.సి.కె.రాజు, మధుసూధన్, సుధాకర్‌రెడ్డి, స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ముదురుతున్న పారిశుధ్య కార్మికుల వివాదం

రెండు వర్గాలుగా విడిపోయి గొడవకు దిగిన వైనం ● పోలీసుల రాకతో సద్దుమణిగిన వివాదం


వాదనలకు దిగిన కార్మికులకు సర్దిచెబుతున్న పోలీసులు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 2 : రుయాస్పత్రిలోని పారిశుధ్య కార్మికుల మధ్య విభేదాలు రోజురోజుకూ ముదురుతున్నాయి. శుక్రవారం ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ గొడవకు దిగడంతో పోలీసులు సర్దిచెప్పాల్సి వచ్చింది. రుయాస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ చేపడుతున్న ఏ-1 ఏజన్సీ కాంట్రాక్టరు తక్కువ కార్మికులతో పనిచేయించుకుంటూ దస్త్రాల్లో ఎక్కువ మందిని చూపించి, తమ శ్రమను దోచుకుంటున్నాడని, నిబంధనల మేరకు జీతాలు ఇవ్వాలని పారిశుధ్య కార్మికులు కొంత కాలంగా ఏఐటీయూసీ, సీపీఐ నేతలతో కలిసి పోరాటం చేస్తున్నారు. ఏజన్సీ నిర్వహణ నిబంధనల మేరకు జరగడంలేదని అధికారులు సైతం పలుమార్లు గుర్తించారు. గణతంత్ర దినోత్సవం రోజున అన్నీ ఏజన్సీలకు ఉత్తమ అవార్డులు ఇచ్చిన రుయా అధికారులు పారిశుధ్య ఏజన్సీకి మాత్రం అందించలేదు. ఈ క్రమంలో ఏజన్సీ నిర్వాహకులు కార్మికుల్లో తమకు అనుకూలంగా ఉన్న కొంతమందితో నిరసనలు చేయిస్తూ పారిశుధ్య ఏజన్సీకి అవార్డు ఇవ్వాలని, ఏజన్సీ నిర్వాహకులు నిబంధనల మేరకే తమతో పనులు చేయిస్తూ సకాలంలో జీతాలు చెల్లిస్తున్నారని తెలియజేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలోనే మిగిలిన పారిశుధ్య కార్మికులు కాంట్రాక్టరుకు అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే పూర్తి జీతాలు ఇస్తున్నారని, మిగిలిన వారికి ఇవ్వడం లేదని అధికారుల ఎదుట పేర్కొంటున్నారు. దీంతో ఏఐటీయూసీ, సీపీఐ నేతలు వీరికి మద్దతుగా నిలిచి కార్మికుల శ్రమ దోచుకుంటున్న ఏజన్సీని రద్దు చేయాలని పోరాటాలు చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఇరువర్గాల కార్మికులు ఏకకాలంలో రుయాస్పత్రి ముందు ఆందోళన కార్యక్రమాలకు దిగారు. ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో దూషణలకు పాల్పడ్డారు. ఒకానొక సమయంలో దాడులకు తెగబడే పరిస్థితులు చోటుచేసుకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి సర్దిచెప్పి పంపారు. వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని, సమస్యకు పరిష్కారం దిశగా ఆలోచించాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సూళ్లూరుపేట వైసీపీలో
శృతి మించిన అసమ్మతిరాగం

అవినీతిపరుడైన సంజీవయ్య వద్దు..
జగనన్న ముద్దు.. అంటూ కరపత్రాల ప్రచారం



ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ముద్రించి చల్లిన కరపత్రాలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 2: సూళ్లూరుపేట వైసీపీలో వర్గ విభేదాలు తారాస్థాయికి చేరాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే కలివేటి సంజీవయ్య ఈ దఫా టికెట్ ఇవ్వకూడదంటూ ఆయన వ్యతిరేక వర్గం అసమ్మతి తెలియజేస్తున్న విషయం తెలిసిందే. అవినీతికి పాల్పడ ఈ ఎమ్మెల్యే సంజీవయ్య మాకొద్దు.. జగన్ ముద్దు అని కరపత్రాలు ముద్రించిన గురువారం రాత్రి పట్టణమంతా చల్లడం అధికార పార్టీలో కలకలం రేపింది. శుక్రవారం ఉదయం పట్టణ వీధుల్లో కరపత్రాలు కనిపించడంతో ఎమ్మెల్యే వర్గం ఉలిక్కిపడింది. ఏడాది కాలంగా ఎమ్మెల్యే సంజీవయ్యకు వ్యతిరేకంగా నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఆయన వ్యతిరేక వర్గం నాయకులు అసమ్మతి తెలియజేస్తున్నారు. అధిష్ఠానానికి సైతం తీసుకెళ్లి తమ గళాన్ని వినిపించారు. రెండుసార్లు అసమ్మతి నేతలందరూ సమావేశమై సంజీవయ్యకు టికెట్ ఇస్తే తాము పనిచేయమని తేల్చి చెప్పారు. ఆయన ఇసుక, గ్రావెల్ మాఫియాకు పాల్పడి కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారని బహిరంగంగా ఆరోపించారు. జనవరి 21న నాయుడుపేటలో జరిగిన సామాజిక బస్సుయాత్రలో ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ ఎంపీ విజయసాయి రెడ్డి వచ్చే ఎన్నికల్లో కిలివేటి సంజీవయ్యే వైసీపీ అభ్యర్థి అని అధికారికంగా ప్రకటించారు. అయితే పార్టీ కార్యాలయం నుంచి ఇంకా స్పష్టత రాకపోవడంతో ఎమ్మెల్యే అభ్యర్థి విషయంలో అనిశ్చితి నెలకొంది. ఈ తరుణంలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఆయన అవినీతికి పాల్పడ్డారు... సంజీవయ్య వద్దు.. జగనన్న ముద్దు అంటూ గుర్తుతెలియని వ్యక్తులు కరపత్రాలు ముద్రించి పట్టణమంతా వీధుల్లో చల్లడం చర్చనీయాంశమైంది. ఇదంతా అసమ్మతి నేతల పనేనని ఎమ్మెల్యే అనుకూల వర్గం అనుమానిస్తోంది. కాగా, ఎన్నికల సమీపిస్తున్న పార్టీలో వర్గవిభేదాలు తారాస్థాయికి చేరడం పట్ల పలువురు నాయకులు ఆందోళన చెందుతున్నారు.

చలో అసెంబ్లీని విజయవంతం చేయండి

పెళ్లకూరు, ఫిబ్రవరి 2: రాష్ట్ర సర్పంచుల సంఘం, పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో ఈనెల 6న విజయవాడలో నిర్వహించే చలో అసెంబ్లీ కార్యక్రమానికి సర్పంచుల తరలిరావాలని ఉమ్మడి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి శుక్రవారం కోరారు.

పుత్తూరు వార్తలు

వేడుకగా పద్మావతిదేవి ఊంజలసేవ



నారాయణవనం, ఫిబ్రవరి 2: నారాయణవనంలో వెలసిన కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవ శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణతో ఊంజలసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం


వేపగుంట సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు, ఫిబ్రవరి 2: పుత్తూరు మండలం వేపగుంటలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని మంత్రి రోజా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను 98 శాతం నేరవేర్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, వైసీపీ నాయకులు సుదర్శన్, లక్ష్మణ్ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని గోవిందమ్మ గుంటలో బలిజ సంఘం భవనానికి మంత్రి భూమి పూజ చేశారు. ఆ సంఘ నాయకులు జయప్రకాష్, రమేష్‌బాబు, చిట్టిబాబు, చక్రపాణి, మెకానిక్ శివ, ఇందుమతి లు పాల్గొన్నారు.

ఆపస్ ఆవిర్భావ దినోత్సవం


జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న ఆపస్ నాయకులు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 2: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఆపస్) ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం పట్టణంలోని ఎంపీపీయూపీ మెయిన్ స్కూల్‌లో నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాజు దొరస్వామి, జిల్లా గౌరవాధ్యక్షుడు మేకల సుబ్రహ్మణ్యమం, ప్రధాన కార్యదర్శి విజయ్, ఉపాధ్యక్షుడు గిరిబాబు, నాధముని, తులసీరామ్, రమేష్, శ్రీధర్, చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


ఎన్‌జీవో కాలనీలో సిమెంటు రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 2: మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఎన్‌జీవో కాలనీలో రూ.12 లక్షలతో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు పనులను వైస్ ఛైర్మన్ జయప్రకాష్‌తో కలిసి పర్యవేక్షించారు. మున్సిపల్ కార్యాలయ నూతన భవనంలో పెయింటింగ్ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచనలిచ్చారు. ఆడుదాం ఆంధ్రాలో పోటీల్లో ఖోఖోలో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన పుత్తూరు మహిళా క్రీడాకారుల జట్టు సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో కోచ్ జయదేవ్, నోడల్ ఆఫీసర్ వంశీ, లలిత్, మేనేజర్ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి
ఇంటర్ విద్యార్థి మృతి


సంతోష్ (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 2: మండల పరిధిలోని పెరిమిటిపాడు చెరువులో పడి ఇంటర్ విద్యార్థి ఎ.సంతోష్(17) మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకొంది. సూళ్లూరుపేట పట్టణంలోని వట్రపాలెంలో నివాసం ఉంటున్న ఆర్టీసీ డ్రైవర్ ఆనంద్ కుమారుడు సంతోష్ పట్టణంలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం పెరిమిటిపాడు గ్రామంలో ఉన్న తన స్నేహితుడు ఇంటికి వెళ్లాడు. ఇద్దరూ కలిసి గ్రామ పొలిమేర్ల వున్న చెరువు వద్దకెళ్లి స్నానం చేస్తుండగా మృతి చెందాడు.

తాగుబోతుల వీరంగం
గడ్డివామి, బైక్ దగ్ధం

కోట, ఫిబ్రవరి 2: కోట పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున తాగుబోతులు వీరంగం సృష్టించారు. పట్టణంలోని ఒక వ్యక్తికి చెందిన మోటారు బైక్‌ను, స్థానిక దళితవాడలోని ఓ గడ్డివామిని తగలబెట్టారు. బాధితులు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగబాబు విచారణ చేపట్టారు.

ఉపాధిలో అవినీతిని ఉపేక్షించం: డ్వామా పీడీ

- ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ల సస్పెన్షన్
- రూ.2,15,825 రికవరీకి ఆదేశం


రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

పెళ్లకూరు, ఫిబ్రవరి 2: ఉపాధి పనుల కల్పనలో అలసత్వం వహించినా... అవినీతి అక్రమాలకు పాల్పడినా... ఉపేక్షించేది లేదని డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం పెళ్లకూరులో ఎంపీడీవో సురేషబాబు అధ్యక్షతన ఉపాధి పనుల సామాజిక తనిఖీ సభ నిర్వహించారు. మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.10.18 కోట్లతో జరిగిన ఉపాధి పనుల వివరాలు వెల్లడించారు. అవకతవకలకు సంబంధించి ఏపీవో, ఈసీ, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి రూ.2,15,825 రికవరీకి ఆదేశించారు. ఇందులో రూ.1,18,017 సూచిక బోర్డులు ఏర్పాటు చేయనందుకు, మస్టర్ల తేడాలకు సంబంధించి రూ.97,808 రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ మొత్తంలో ఏపీవో నుంచి రూ.23,305, అందరు ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.19,870, ఒక టెక్నికల్ అసిస్టెంట్ నుంచి 12,615, మిగిలిన నగదు ఇతర సిబ్బంది నుంచి వసూలు చేయాలని నిర్ణయించారు. అదేవిధంగా నిబంధనల ప్రకారం జాబ్ కార్డులు కలిగిన వారికి వంద రోజులు పని దినాలు కల్పించకపోవడం, చేసిన పనుల కొలతల్లో తేడా ఉండడం తదితర అంశాలను గుర్తించారు. చిల్లకూరు పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ రత్నయ్య, పునబాకకు చెందిన టెక్నికల్ అసిస్టెంట్ కృష్ణవేణిలను సస్పెండ్ చేస్తున్నట్లు డ్వామా పీడీ ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారిణి భాగ్యలక్ష్మి, అంబుడ్స్‌మెన్ రాసరాయనాయుడు, ఏపీడీ రవికుమార్‌నాయుడు, ఎస్ఆర్పీ నాగరాజు ఎంపీడీవో కే.సురేష్‌బాబు, ఏపీవో దయానందం పాల్గొన్నారు.

వెంకటగిరిలో రూ.62,936 రికవరీ

వెంకటగిరి టౌన్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి పనుల సామాజిక తనిఖీ సభ నిర్వహించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీల వారీగా జరిగిన పనుల వివరాలను పరిశీలించారు. లక్ష్యాన్ని పూర్తి చేయని టీఏ, ఎఫ్ఏలను తొలగించాలని ఆదేశించారు. రూ.62,936 రికవరీకి ఆదేశించి రూ.9522 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు పంచాయతీల్లో జాబ్ కార్డులు కూడా పంపిణీ చేయలేదని, సంతకాలు, వేలిముద్రలు లేకుండా బిల్లులు ఎలా ఇస్తారని సిబ్బందిపై మండిపడ్డారు. ఇక్కడ ఏపీవోను సస్పెండ్ చేస్తే మండలం బాగుపడుతుందని అన్నారు. రూ.6.49కోట్ల పనులకు రూ.2.28కోట్ల పనిదినాలు కల్పించినట్లు వెల్లడించారు. అవినీతికి పాల్పడిన వారిపై కేసులు పెట్టి రికవరీ చేయిస్తామని స్పష్టం చేశారు. ఉపాధి పథకం కింద డ్రైనేజీ పనులు చేస్తే ఇప్పటి వరకు సిమెంటు డబ్బులు రాలేదని ఎంపీపీ భర్త శివారెడ్డి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన పీఆర్ ఏఈ సిబ్బందిని పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై ఎస్ఈకి ఫిర్యాదు చేసి తగు న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారిణి భాగ్యలక్ష్మి, అంబుడ్స్‌మన్ రాసారాయ రాయుడు, ఏపీడీ ప్రేమ్ కుమార్, ఎస్ఆర్పీ నాగరాజు, ఎంపీడీవో నీలకంఠేశ్వర రెడ్డి, ఏపీవో దీప, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి నిరోధక పాలనకు స్వస్తి పలకాలి: నెలవల


అశోక్‌కుమార్‌కు మద్దతు పలుకుతున్న నెలవల తదితరులు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 2: రాష్ట్రంలో అరాచక, అభివృద్ధి నిరోధక పాలనకు ప్రజలు స్వస్తి పలకాలని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని ఇచ్ఛాపురం నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తున్న అశోక్‌కుమార్ శుక్రవారం నాయుడుపేటకు చేరుకున్నారు. ఆయనకు నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందలక్ష్మారెడ్డి స్వాగతం పలికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ జగన్ రూ.12 లక్షల కోట్లు అప్పులు చేశాడేగానీ రాష్ట్రంలో ప్రాజెక్టులను పూర్తి చేయలేదన్నారు. కనీసం రోడ్లను బాగు చేయలేదని విమర్శించారు. పాదయాత్ర చేస్తున్న శివకుమార్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, మంత్రులు కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఏ చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన ఆవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అశోక్‌రెడ్డి, శ్రీరామ్ ప్రసాద్, గూడూరు సుధీర్‌రెడ్డి, కృష్ణయ్య, దార్ల రాజేంద్ర, ముత్యాలయ్య, చక్రపాణి, శ్రీనివాసులు, అవధానం సుధీర్, కాశీ, సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్


ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

చిట్టమూరు, జనవరి 2: బాబు వస్తేనే.. రాష్ట్ర ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలో తీర ప్రాంత గ్రామాలైన బురదగాలి, కొత్తపాళెంలో నిర్వహించారు. చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎర్రబోతు సుబ్రహ్మణ్యం, నరేష్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, చిన్నారావు, చెంచురామయ్య ఆచారి, విద్యానాయుడు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊనుగుంటపాళెంలో...

కోట, ఫిబ్రవరి 2: మండల పరిధిలోని ఊనుగుంటపాళెంలో శుక్రవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులు ఊనుగుంటపాళెం, దళిత, అరుంధతీయ, వడ్డిపాళెం, గిరిజన కాలనీల్లో పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, పాదర్తి కోటేశ్వరరెడ్డి, నెల్లూరు మోహన్‌రెడ్డి, రఘురామరెడ్డి, మధుయాదవ్, జానా వెంకట కృష్ణయ్య, బాలకృష్ణయాదవ్, జడ వేణు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కోట ఎంపీడీవోగా శంకరయ్య



కోట, ఫిబ్రవరి 2: కోట ఎంపీడీవోగా మంగళం శంకరయ్య బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా బి.కొత్తకోటలో పనిచేస్తున్న ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మారేళ్ల భవానీ చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

చిల్లకూరు ఎంపీడీవోగా భానుమూర్తిరావు



చిల్లకూరు, ఫిబ్రవరి 2: చిల్లకూరు ఎంపీడీవోగా భానుమూర్తిరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వడమాలపేటలో పనిచేస్తున్న ఆయన చిల్లకూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటసాయిసూర్య చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

చిట్టమూరు ఎస్‌ఐగా చిన్న బలరామయ్య

చిట్టమూరు, ఫిబ్రవరి 2: చిట్టమూరు ఎస్‌ఐగా చిన్న బలరామయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుమలలో పనిచేస్తున్న ఆయన బదిలీపై చిట్టమూరుకు వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐలుగా పనిచేస్తున్న గోపి నాయుడుపేటకు, లక్ష్మీభవాని తిరుపతికి బదిలీ అయ్యారు.

సూళ్లూరుపేట ఎస్‌ఐగా రహీం రెడ్డి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 2: సూళ్లూరుపేట ఎస్‌ఐగా రహీం రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

కారు చోరీ కేసు దర్యాప్తులో బయటపడ్డ మహిళ హత్య

ఇద్దరు నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ యశ్వంత్ - పోలీసుల అదుపులో నిందితులు నరేంద్రనాథ రెడ్డి, ఓబులేశు

చంద్రగిరి, ఫిబ్రవరి 2: ఎనిమిది నెలలక్రితం జరిగిన ఓ మహిళ హత్య కేసును చంద్రగిరి పోలీసులు ఛేదించారు. కారు చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి విచారించగా ఈ విషయం బయటపడింది. శుక్రవారం తిరుపతి జిల్లా చంద్రగిరిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ యశ్వంత్ కేసు వివరాలు వెల్లడించారు. తాడిపత్రికి చెందిన గ్రానైట్ వ్యాపారి నరేంద్రనాథ రెడ్డితో అనంతపురానికి చెందిన జయమ్మ(35) సహజీవనం చేస్తుండేది. వీరికి ఒక కుమారుడు పుట్టాడు. తరువాత నరేంద్రనాథ్‌రెడ్డి మరో వివాహం చేసుకుని చంద్రగిరి మండలం బుచ్చినాయుడుపల్లె వద్ద దున్నలు, పొట్టేళ్లు, నాటు కోళ్ళ ఫామ్ పెట్టి స్థిరపడ్డాడు.జయమ్మకు పుట్టిన శరణ్‌కుమార్‌రెడ్డిని నరేంద్రనాథ రెడ్డి తన వద్దే ఉంచుకున్నాడు. దీంతో జయమ్మ అపుడప్పుడూ బుచ్చినాయుడుపల్లెకు వచ్చి నరేంద్రనాథరెడ్డి తనను మోసం చేశాడని, తన బిడ్డను కూడా దూరం చేశాడని గొడవ పెట్టుకునేది.ఈ నేపథ్యంలో గత సంవత్సరం మే 25వ తేదిన నరేంద్రనాథరెడ్డిని ఫారం వద్దకు వచ్చిన జయమ్మ నిలదీస్తుండగా అతడి వద్ద పనిచేస్తున్న ఓబులేశు పికాసితో ఆమె తలపై కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అదేరోజు రాత్రి జయమ్మ మృతదేహాన్ని నరేంద్రనాథరెడ్డి తన కారులో వేసుకుని ఓబులేశు, తన వద్ద పనిచేసే అప్పారావు, రఘుపతిరాజులతో కలిసి అన్నమయ్య జిల్లా రాజంపేట వద్ద చెయ్యేరు చెరువు వంకలో పూడ్చిపెట్టారు.పది రోజుల క్రితం నరేంద్రనాథరెడ్డి తన కారు చోరీ అయిందని చంద్రగిరి స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.ఈ కేసు దర్యాప్తులో భాగంగా కారు చోరీ చేసిన అప్పారావును పోలీసులు అరెస్ట్ చేసి విచారించారు. దీంతో జయమ్మ హత్య వెలుగులోకి వచ్చింది. జయమ్మను హత్య చేస్తే ఒక్కొక్కరికి రూ.5 లక్షలు ఇస్తానని నరేంద్రనాథరెడ్డి హామీ ఇచ్చాడు. అయితే డబ్బులు ఇవ్వకపోవడంతో కారు చోరీ చేసినట్లు అప్పారావు ఒప్పుకున్నాడు. కాగా జయమ్మ కనిపించడంలేదంటూ ఆమె సోదరుడు దేవేంద్ర అనంతపురం నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పారావు ఇచ్చిన సమాచారం మేరకు చంద్రగిరి పోలీసులు శుక్రవారం కళ్యాణి డ్యామ్ వద్ద నరేంద్రనాథరెడ్డి, ఓబులేశులను అరెస్ట్ చేశారు. రఘుపతిరాజు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. అరెస్ట్ అయిన నిందితులను కోర్టుకు తరలించారు.

కేసు ఛేదించిన బృందానికి రివార్డు

కారు చోరీ కేసుతోపాటు జయమ్మ హత్య కేసును ఛేదించిన డీఎస్పీ యశ్వంత్, సీఐ రాజశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ బాలకృష్ణ, కానిస్టేబుళ్లు జాకీర్ హుస్సేన్, కార్తీక్, మునిరత్నం, గోపి, వేణుగోపాల్, అన్వర్‌బాషాలను ఎస్పీ పరమేశ్వరరెడ్డి అభినందించి రివార్డులతో సత్కరించారు.

ఐఏఎస్‌ల తీరు బాధాకరం
టీడీపీ, జనసేన


సమావేశంలో మాట్లాడుతున్న ఊకా విజయకుమార్, కిరణ్ రాయల్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 2: చేసిన తప్పులకు ఇప్పటికే కొందరు ఐఏఎస్‌లు శిక్ష అనుభవిస్తున్నా కొత్తగా వచ్చిన వారిలో ఏ మాత్రమూ మార్పు కనిపించకపోవడం బాధాకరమని టీడీపీ, జనసేన నాయకులు విమర్శించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో టీడీపీ నాయకుడు ఊకా విజయకుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ మాట్లాడుతూ జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ లక్ష్మీశా, నగరపాలక సంస్థ కమిషర్ అదితిసింగ్ స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఇంటికెళ్లి సన్మానాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కుమారుడు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తుండడం, మరికొన్ని రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ ఇద్దరు ఐఏఎస్‌ల తీరు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈసీ దీనిపై ప్రత్యేక దృష్టి సారించి, ఆ ఇద్దరు అధికారులను రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అధికార పార్టీకి తగినట్లుగా అధికారుల బదిలీలు జరిగాయని ఆరోపించారు. తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో జరుగుతున్న అవకతవకల వల్ల ప్రజాస్వామ్యంపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారన్నారు.

కలెక్టర్‌ను ఈసీ రీకాల్ చేయాలి

జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ లక్ష్మీశాను ఈసీ రీకాల్ చేయాలని టీడీపీ తిరుపతి నగర అధ్యక్షుడు చిన్నబాబు డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ కలెక్టర్ స్థాయిలో ఉన్న వ్యక్తి తిరుపతి ఎమ్మెల్యే ఇంటికెళ్లి కలవడం, సన్మానం చేయడం దారుణమన్నారు. కలెక్టర్‌ను కేంద్ర ఎన్నికల సంఘం రీకాల్ చేసి ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలన్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డిని ఒంగోలుకు మార్చడం అక్కడ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి అనుకూలంగా వ్యవహరించేందుకేనని ఆరోపించారు. వైసీపీకి విధేయుడిగా ఉంటున్న తిరుచానూరు సీఐ శివప్రసాద్‌రెడ్డిని తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేయడం కూడా అలాంటిదేనన్నారు. తిరుమల వన్‌టౌన్ సీఐ జగన్‌మోహన్‌రెడ్డిని డీటీసీగా బదిలీ చేశారన్నారు. టీడీపీ నాయకులు రాజేంద్రప్రసాద్, స్రవంతి, చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు మెరుగైన ఉపాధి


యువతనుద్దేశించి మాట్లాడుతున్న పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 2: టీడీపీ ప్రభుత్వంలోనే యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మాజీ కౌన్సిలర్ భారతి ఆధ్వర్యంలో యువత టీడీపీలోకి చేరడంతో వారికి మాజీ ఎమ్మెల్యే పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్న సమయంలో రాష్ట్రానికి అనేక పరిశ్రమలను తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పించారని అన్నారు. ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయడంతో ఎంతో మంది యువతకు ఉద్యోగాలు లభించాయన్నారు. యువతకు నిరుద్యోగభృతిని అమలు పరిచింది కూడా టీడీపీ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయకుండా, ఉద్యోగాలు కల్పించకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందన్నారు. మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా యువగళం నిధిని ఏర్పాటు చేసి నెలకు రూ. 3వేల చొప్పున నిరుద్యోగభృతిని అందించేలా చంద్రబాబు నాయుడు పథకం రూపొందించారన్నారు. నారా లోకేశ్ చెప్పిన విధంగా టీడీపీ అధికారంలోకి రాగానే యువతకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం మొదటిసారి ఓటుహక్కు పొందిన యువతకు 'నా మొదటి ఓటు సీబీఎన్‌కే' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, భారతి, సందీప్, వెంకటసాయి, సునీల్, వెంకటేష్, సుబ్రమణ్యం, శివకుమార్, లోకేశ్, మురళి, సాయితేజ, మధుసూదన్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, వెంకటేశ్వర్లురాజు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు వైసీపీలో పెరిగిన ఆశావహులు

సత్యవేడు, ఫిబ్రవరి 2: సత్యవేడు నియోజకవర్గ వైసీపీలో స్థానికేతర అంశం చర్చనీయాంశంగా మారుతోంది. వైసీపీ అధిష్ఠానం అభ్యర్థిగా గంగాధర నెల్లూరుకు చెందిన నూకతోటి రాజేష్‌ను ప్రకటించడంతో పార్టీలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అతడి స్థానికతను ప్రశ్నించడంతో పాటు స్థానికులకే టికెట్ ఇవ్వాలన్న డిమాండ్ పెరుగుతోంది. టికెట్ తమకు కావాలంటే తమకు కావాలని సోషల్ మీడియాలో పలువురు నేతలు తమ వాదనలు వినిపిస్తున్నారు. నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగులు అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. కొందరు నేతలు ప్రెస్‌మీట్లు పెట్టి మరీ బహిరంగంగానే అభ్యర్థిస్తున్నారు. కేవీబీపురం మాజీ జడ్పీటీసీ డేవిడ్, సత్యవేడు మాజీ ఎంపీటీసీ రవి, తొండూరు మాజీ సర్పంచ్ కవిత, రిటైర్డ్ ఏఈ మురళి, బ్యాంక్ మేనేజర్ మనోహర్ తదితరులు టికెట్ కోరుతూ సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తుండడం ప్రస్తుతం సత్యవేడు వైసీపీలో నెలకొన్న తాజా పరిణామాలకు నిదర్శనం అని చెప్పుకోవచ్చు.ఎన్నికల నాటికి వైసీపీలో మళ్ళీ అభ్యర్థిని మారుస్తారన్న ఊహాగానాలు వినబడుతున్నాయి. దీంతో నియోజకవర్గ తెరపై వైసీపీ అభ్యర్థిగా మరోపేరు వినిపిస్తోంది. సత్యవేడు, నాగలాపురం మండలాల్లో ఇదివరకు పనిచేసిన ఓ పోలీస్ అధికారి భార్యపేరు వినిపిస్తోంది. ఈమె శుక్రవారం వరదయ్యపాళెం మండలంలో పలువురు నాయకులను కలిసి మంతనాలు జరిపినట్లు సమాచారం.

అడుగు పెట్టని కొత్త అభ్యర్థి

ఇదిలా ఉండగా వైసీపీ అధిష్ఠానం ప్రకటించిన నూతన అభ్యర్థి రాజేష్ ఇంకా నియోజకవర్గంలో అడుగుపెట్టకపోవడం చర్చనీయాంశంగా మారింది, అధిష్ఠానం అభ్యర్థిత్వాన్ని ప్రకటించి రెండు రోజులవుతున్నా ఇంకా నియోజకవర్గం మొహం చూడకపోవడం ,నాయకులను, కార్యకర్తలను ప్రత్యక్షంగా కలవకపోవడం, కార్యాచరణపై చర్చించక పోవడం విశేషం.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 2: ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని గూడూరు సీనియర్ సివిల్ జడ్జి మురళీధర్ అన్నారు. శుక్రవారం స్థానిక మదర్ అకాడమీ పాఠశాలల్లో స్వామి వివేకానంద యువసైన్యం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం జడ్జి మురళీధర్‌ను ఏపీపీ ప్రకృతి కుమార్, పాఠశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ నరసింహారావు, ఐటీఐ ట్రైనింగ్ అధికారి రామారావు, కరస్పాండెంట్ పవన్ సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి: జనసేన

చిల్లకూరు, ఫిబ్రవరి 2: రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న వైసీపీ పాలనకు చరమగీతం పాడాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వునుగుంట పాళెం గ్రామంలో జనసేన ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి జనసేన పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికలలో రాష్ట్రాభివృద్ధి కాంక్షించే జనసేన - టీడీపీ ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంద్రవర్ధన్, మహేష్, ఉనీల్, హరికృష్ణ, సాయి, శివ, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీటీ సిమిలేషన్స్‌పై
ఉపాధ్యాయులకు అవగాహన

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 2: ఐసీటీ సిమిలేషన్స్‌పై గణిత ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈవో శివప్రకాష్‌రెడ్డి అవగాహన కల్పించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నాయుడుపేట, పెళ్లకూరు. చిట్టమూరు, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ డీఈవో శివప్రకాష్‌రెడ్డి గణిత ఉపాధ్యాయులకు పలు సలహాలు, అందజేశారు. ఐసీటీ సిమిలేషన్స్‌ను తరగతి గదుల్లో ప్యానల్స్ ద్వారా వివిధ మాధ్యమాల సాయంతో విద్యార్థులు నేర్చుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మునిరత్నం, హెచ్‌ఎం సుధాకర్, రిసోర్స్ పర్సన్లు మహ్మద్ షఫీఉల్లా, బాలసుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

దళిత ద్రోహి జగన్ : కాంగ్రెస్

సత్యవేడు, ఫిబ్రవరి 2: సీఎం జగన్ దళిత ద్రోహి అని మాజీ ఎంపీ చింతా మోహన్ ఆరోపించారు. సత్యవేడులో శుక్రవారం చింతామోహన్ ఆధ్వర్యంలో 'మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలో ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ కరప త్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అంటరానితనం రాజ్యమేలుతోందని విమర్శించారు. ఎలాంటి నేరం చేయని దళితుడు, అమాయకుడైన కోడి కత్తి శీనుని జగన్ ప్రభుత్వం ఐదే ళ్లుగా జైల్లోనే ఉంచి అతని కుటుంబానికి మానసిక క్షోభకు గురి చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రస్తుతం మంత్రిగా ఉన్న అప్పటి ఓ ఎమ్మెల్యే ఎయిర్‌పోర్టులోకి బాటిల్లో రక్తాన్ని తీసుకొచ్చి జగన్ చొక్కాకు పూసి కోడి కత్తి డ్రామాలాడారని ఆరోపించారు. చంద్రబాబు పేదల ద్రోహి అని విమర్శించారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు



పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

తొట్టంబేడు, ఫిబ్రవరి 2: ఉపాధి హామీ పనుల్లో అవతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని పీడీ శ్రీనివాసప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని చియ్యవరం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం తనిఖీ చేశారు. తాగునీరు, నీడ, తదితర వసతులు అందుతున్నాయా లేదా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ 100 రోజులు పని దినాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ పథక సంచాలకులు ప్రేమ్‌కుమార్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

టోక్యో ఆటోమోటివ్ ఎక్స్‌పోలో మెరిసిన శ్రీసిటీ



శ్రీసిటీ స్టాల్లో శ్రీసిటీ మార్కెటింగ్ అధికారులు, మసనోరి నకనో

శ్రీసిటీ, ఫిబ్రవరి 2: జపాన్ రాజధాని టోక్యోలో గత వారం జరిగిన ఆటోమోటివ్ వరల్డ్‌లో శ్రీసిటీ ప్రాధాన్యతను చాటుకుంది. ఎలక్ట్రిక్ వాహనాలు, అటానమస్ డ్రైవింగ్, కనెక్టడ్ కార్ల అత్యాధునిక పురోగతిపై ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్ అందరి దృష్టినీ ఆకర్షించిందని సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ గోపీకృష్ణ వివరించారు. శ్రీసిటీ పారిశ్రామిక అభివృద్ధికి, ప్రత్యేకించి ఆటోమోటివ్ తయారీ రంగంలో నిరంతర వృద్ధికి ఈ ఎగ్జిబిషన్ దోహదపడిందని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

ముక్కంటి సేవలో సినీ నటుడు సత్య ప్రకాష్



సత్యప్రకాష్‌కు స్వామి అమ్మవార్ల చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2: శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని శుక్రవారం సినీ నటుడు సత్య ప్రకాష్ దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు దర్శన ఏర్పాట్లు చేశారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం అంజూరు శ్రీనివాసులు స్వామి అమ్మవార్ల చిత్రపటం, తీర్థ ప్రసా దాలు అందజేశారు.

అబాకస్‌లో విద్యార్థిని ప్రతిభ



చరిష్మను అభినందిస్తున్న శ్రీధర్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2: శ్రీకాళహస్తిలోని విశ్వ భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఆరో తరగతి చదువుతున్న చరిష్మా ఆన్‌లైన్ అబాకస్ పోటీల్లో సత్తాచాటింది. ఇందులో భాగంగా నాల్గవ లెవెల్‌లో మొదటి బహుమతి సాధించింది. ప్రతిభచూపిన విద్యార్థిని చరిష్మను హెడ్‌మాస్టర్ శ్రీధర్ శుక్రవారం అభినందించారు.

మెరుగైన ఫలితాల కోసం రాత్రిపూట సందర్శన



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 2: పదో తరగత విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధన లక్ష్యంగా కల్లివెట్టు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల ఇంటి సందర్శన కార్యక్రమాన్ని గురువారం రాత్రి చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ మాట్లాడుతూ ఈ విధానం వలన విద్యార్థులు మరింత బాధ్యతగా చదువుతారని తెలియజేశారు. ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, నాదెండ్ల మురళి పాల్గొన్నారు.

ఎలుకల నివారణతో పంట కాపాడుకుందాం



వరి పొలాల్లో ఎలకల మందు పెడుతున్న వ్యవసాయ అధికారులు

శ్రీకాళహస్తి/ వరదయ్యపాళెం/ బుచ్చినాయుడు కండ్రిగ/ ఏర్పేడు, ఫిబ్రవరి 2: వరి సాగులో సామూహిక ఎలకల నివారణతో పంటను కాపాడుకోవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ ధనుంజయరెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి మండలం కాపు గున్నేరిలో శుక్రవారం సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. బ్రమోడియోలోన్ ఎలుకల మందుల నుంచి 100 గ్రాములు తీసుకుని అందులోకి 10 గ్రాముల వంటనూనె, అలాగే 6.2 కేజీల వరి నూకలతో మిశ్రమం తయారు చేశారు. 25 ఎకరాలకు ఈ మిశ్రమాన్ని చిన్నచిన్న ప్యాకెట్లుగా ఉపయోగించి ఎలుకలను సామూహికంగా నివారించవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్‌రెడ్డి, ఏవో సుధాకర్‌రెడ్డి, వీఏఏ పావని, రైతులు పాల్గొన్నారు. ● వరదయ్యపాళెం మండలంలోని కడూరు రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయాధికారి సుహర్ లత ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ● బుచ్చినాయుడు కండ్రిగ మండలం పల్లమాల గ్రామంలో ఏవో భారతి ఎలుకల నివారణ మందును రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ● ఏర్పేడు మండలం వికృతమాల, ఆర్వీ కండ్రిగ, గుడిమల్లం, చెల్లూరు, ఎండీపుత్తూరు, బండారు పల్లి, కొత్తవీరాపురం, రైతు భరోసా కేంద్రాల్లో ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. ఏవో షణ్ముగం, వీఏఏ మహేష్ రైతులు పాల్గొన్నారు.

పింఛనులో పన్నుల కట్

ఏర్పేడు, ఫిబ్రవరి 2: ప్రతి నెలా వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఇచ్చే పింఛనులో ఇంటి పన్ను, కుళాయి పన్నులను పంచాయతీ అధికారులు కట్ చేస్తున్నారు. దీంతో వారి జీవనం కష్టంగా మారనుంది. ఏర్పేడు మండలంలో ప్రధానంగా మునగల పాళెం పంచాయతీలో గురువారం నుంచి అందిస్తున్న పింఛన్‌లో ఆ పంచాయతీ అధికారులు వలంటీర్ల సాయంతో ఇంటి పన్ను, కుళాయి పన్ను పట్టుకుని మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారులకు అందిస్తున్నారు. దీనిపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


సత్యవేడు వైసీపీ అభ్యర్థిగా అవకాశమివ్వండి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ డేవిడ్

కేవీబీపురం, ఫిబ్రవరి2: సత్యవేడు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా స్థానికుడైన తనకు అవకాశం ఇవ్వాలని మాజీ జడ్పీటీసీ డేవిడ్ కోరారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఏడు మండలాల్లో సమస్యల పట్ల తనకు అవగాహన ఉందని చెప్పారు. ఎమ్మెల్యేగా ఎక్కడో బయట వారిని తీసుకువచ్చి ఇక్కడ పోటీ చేయించడం పార్టీ శ్రేయస్కరం కాదన్నారు. బీసీ సెల్ నాయకుడు హరిబాబు, ఎస్సీ సెల్ నాయకుడు అరుణకుమార్ పాల్గొన్నారు.

'నేనున్నాను.. ఓటు కల్పించండి'



తొలగించిన మునిరమణ ఓటు

కేవీబీపురం, ఫిబ్రవరి2: మండలంలోని కళత్తూరు గ్రామానికి చెందిన ముని రమణ (22) ఓటును నిర్లక్షణంగా ఓటును తొల గించి వేశారు. తాత ముత్తాతల కాలం నుంచి కళత్తూరులో సొంత ఇల్లు కలిగి ఉన్నామని తన తండ్రి ఎంపీడీవో కార్యాల యంలో స్వీపర్‌గా పనిచేస్తాడని అటువంటి తన ఓటును తొలగించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశాడు.

వైఎస్ఆర్ బీమా పంపిణీ

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 2: ఇందిరానగర్ పంచాయతీలో పద్మావతి పురానికి చెందిన దారా రామ్‌ప్రసాద్ చెన్నైలో మరణిం చాడు. ఆయన కుటుంబానికి అధికారులు వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలు అందించారు. మిగిలిన రూ.4.90లక్షలు వారి ఖాతాలో జమవుతుందని కార్యదర్శి హబీబ్, సర్పంచ్ సల్ల వీరభద్రమ్, వెల్ఫేర్ అసిస్టెంట్ తెలిపారు.

రైల్వే స్టేషన్లలో సీసీఎం పీఎస్ తనిఖీలు

రేణిగుంట, ఫిబ్రవరి 2: దక్షిణ మధ్య రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీఎస్) సత్యనారాయణ శుక్రవారం తిరుపతి, రేణిగుంట రైల్వే స్టేషన్లలో విస్తృతంగా తనిఖీలు చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ప్రయాణికులకు కల్పించే మౌలిక వసతులను, అందిస్తున్న సదుపాయాలు, తిరుపతి రైల్వే స్టేషన్‌లో దక్షిణ దిశవైపు ఆధునిక వసతులతో నిర్మిస్తున్న భవనాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట సీసీఐ శ్రీకాంత్, గుంతకల్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ సోమశేఖరనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ-జనసేనను ఆశీర్వదించండి



ఉమ్మడి మేనిఫెస్టోపై ప్రచారం వినుత

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2: వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపిం చాలని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత కోరారు. శ్రీకాళహస్తి మండలం లోని కాపుగున్నేరి పంచాయతీలో జనసేన నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రబాబు, రాఘవయ్య గణేష్, శివకుమార్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని చిత్తుగా ఓడించాలి : టీడీపీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2: రాష్ట్రం బాగుపడాలంటే వైసీపీని చిత్తుగా ఓడించాలని టీడీపీ నాయకురాలు రిషితారెడ్డి కోరారు. మండలంలోని పుల్లారెడ్డికండ్రిగ, అమ్మపాళెం పంచాయితీల్లో శుక్రవారం ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. మండల అధ్యక్షులు కామేష్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి బత్తిరెడ్డి, యూనిట్ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, చెంచయ్య నాయుడు పాల్గొన్నారు. కాగా పుల్లారెడ్డి కండ్రిగ దళితవాడకు చెందిన సుబ్రమణ్యం 20 మంది మిత్రులతో కలిసి టీడీపీలో చేరారు.

మా పంటలకు నీళ్లివ్వండి



అడ్డువేసిన ఇసుక మూటలు తొలగిస్తున్న రైతులు

కేవీబీపురం, ఫిబ్రవరి2: తమ పంటలకు నీళ్లివ్వాలని మండలంలోని కోవనూరు అంజూరు, గుంటిపేడు, అంగేరి చెరువు, పవనివారి కండ్రిగ, కర్లపూడి, గురుకుల కండ్రిగ, బ్రహ్మణపల్లి గ్రామాలకు చెందిన తెలుగు గంగ కాలువ ఆయకట్టు రైతులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తెలుగు గంగ కాలువలో దిగి నిరసన వ్యక్తం చేశారు. లక్ష్మీపురం వద్ద కొంత మంది రైతులు నీళ్ల దిగువకు రాకుండా ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేశారు. దీన్ని గమనించిన కేవీబీ పురం గ్రామాల రైతులు కోవనూరు సర్పంచ్ పెంచలయ్య ఆధ్వర్యంలో అడ్డు వేసిన ఇసుక బస్తాలను తొలగించారు. సహజంగా వేసవిలో నీరు తగ్గిపోవడంతో అంజూరు వద్ద ఉన్న గేట్లను మూసివేసి నిల్వచేరిన నీటిని రైతులు వినియోగించుకుని తర్వాత మళ్లీ గేట్లు ఎత్తివేస్తారు. దీంతో లక్ష్మీపురం వరకు నీరు నిల్వ ఉంటుంది. అయితే ప్రస్తుత పరిస్థితిలో లక్ష్మీపురం, పీవీ కండ్రిగకి చెందిన కొంత మంది రైతులు అడ్డుకట్ట వేశారు. ఫలితంగా కేవీబీపురం మండలంలో వరి, వేరుశనగ పంటలు ఎండిపోయే పరి స్థితిలో ఉన్నాయి. ఈ క్రమంలో అధికారులు, తిరుపతి ఎంపీ స్పందించి తమకు నీరు విడుదల చేసి పంటలు కాపాడాలని రైతులు కోరుతున్నారు.

తిరుపతిని రాజధాని చేయాలి : చింతామోహన్



ర్యాలీలో మాట్లాడుతున్న చింతామోహన్

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 2: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా తిరుపతి ఉం డాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. వరదయ్యపాళెం ఆర్టీసీ బస్టాండు వద్ద కాంగ్రెస్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్రాసు నుంచి ఆంధ్ర విభజన జరిగిన సమయంలో 1953లో ఎన్‌జీ రంగా తిరుపతిని రాజధానిగా చేయాలని అడిగారని అయితే ఆ రోజు జవహర్‌లాల్ నెహ్రూ నీలం సంజీవరెడ్డి మాట విని కర్నూలును చేశారన్నారు. తిరుపతికి రావాల్సిన రాజధానిని చంద్రబాబు తుళ్లూరుకు తీసు కెళ్లారని దుయ్యబట్టారు. ఇపుడు జగన్ విశాఖపట్టణంలో పెట్టారని ఎద్దేవాచేశారు. ఇద్దరి నిర్వాకంతో రాజధాని లేకుండా పోయిందన్నారు. తిరుపతి రాజధాని కావాలా వద్దా అనే అంశంపై ప్రజా బ్యాలెట్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

తొట్టంబేడు: తిరుపతిని రాజధానిగా చేయాలని మాజీ ఎంపీ చింతామోహన్ కోరారు. శ్రీకాళహస్తిలో ర్యాలీ నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో మూడు నామాలు పెడుతూ ఏపీకి రాజధాని లేకుండా చేశారన్నారు.

రక్తహీనత సమస్యకు నివారణే మార్గం



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

సత్యవేడు, ఫిబ్రవరి 2: రక్త హీనత సమస్యకు చికిత్స కన్నా నివారణే ఉత్తమ మార్గ మని జిల్లా ప్రజా ఆరోగ్య నర్సింగ్ అధికారి బేబీరాణి పేర్కొన్నారు. శుక్రవారం సత్యవేడు పట్టణం ఉలవచేను వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లో గర్భిణులకు, పిల్లలకు రక్తహీనత పరీక్షలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. ప్రధానంగా విటమిన్ సీ అధికంగా ఉన్న ఉసిరికాయలు, సిట్రస్ పండ్లు, ఆరెంజ్, టమోటాలు, ఖర్జూరం, బెల్లం, నల్లనువ్వులు, జీడీ పప్పు వంటివి తీసుకోవాలని సూచించారు. తద్వారా మాతా శిశు మరణాలను తగ్గించవచ్చన్నారు. అంతకు ముందు రక్తహీనతకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదు రికార్డుకు, క్షేత్ర స్థాయి గణాంకాలకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించారు. అనంతరం బాలికలకు, గర్భిణులకు, పిల్లలకు హిమోగ్లోబిన్ శాతానికి సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి, జిల్లా ఆరోగ్య ఎస్‌వో నాగేంద్రకుమార్, ప్రకాష్, దాసు కుప్పం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్ నాగజ్యోతి, ఎంఎల్‌హెచ్‌పీ మేఘన, ఏఎన్ఎంలు, సహాయ మేరి, రోస్లిన్, యమున, స్వాతి, ఆశ వర్కర్లు వెంకటలక్ష్మి, దాక్షాయణి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఘనంగా వీడ్కోలు



సత్యవేడు, ఫిబ్రవరి 2: సత్యవేడు తహసీల్దార్ షేక్ జరీనాకు రెవెన్యూ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీటీ రవిచంద్రబాబు ఆధ్వర్యంలో సిబ్బంది అన్నమయ్య జిల్లాకు బదిలీ అయిన తహసీల్దార్ షేక్ జరీనా బేగంకు శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సురేష్, జూనియర్ అసిస్టెంట్ జీవకల, మండల సర్వేయర్ వెంకటేశులు, సచివాలయ సర్వేయర్లు గిరి, శశికళ, నవీన్, వీఆర్‌వోలు రమేష్, శేఖర్, విక్రాంత్, నాగార్జున్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు సుధ, మాధురి, పలువురు వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.44 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.44 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 57,233 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 18,015 మంది తలనీలాలు సమర్పించారు.

కేజీబీవీకి మ్యాథ్స్ గెస్ట్ ఫ్యాకల్టీ కావాలి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 2: తడ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మ్యా థ్స్ సబ్జెక్టును బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ అవసరముందని డీఈవో డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. ఎమ్మెస్సీ (మ్యాథ్స్) విద్యార్హత ఉన్న అభ్య ర్థులు ప్రిన్సిపాల్ ఫోన్ నెంబరు 9052156838 లేదా 9441863994ను సంప్రదించాలని కోరారు.

టీటీడీ ట్రస్టులకు రూ.21 లక్షల విరాళం

తిరుమల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): టీటీడీలోని పలు ట్రస్టులకు శుక్రవారం రూ.21 లక్షలు విరాళంగా అందింది. ఢిల్లీకి చెందిన రమా సివిల్ ఇండియా కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.11 లక్షలు, భువనేశ్వర్‌కు చెందిన శివం కాండెన్ ప్రైవేట్ లిమిటెట్ సంస్థ ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందిం చాయి. ఆ సంస్థల ప్రతినిధి తిరుపతికి చెందిన రాఘవేంద్ర చెక్‌లను తిరుమల అన్నమయ్య భవన్‌లో ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

వేడుకగా శుక్రవార ఉత్సవం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవా రోత్సవం వేడుకగా జరిగింది. అలంకార మండపంలో అమ్మవారి త్సవ మూర్తిని విశేషంగా అలంక రించారు. ధూప, దీప, నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి ప్రాకా రోత్సవం నిర్వహించి తిరిగి మండపంలో కొలువుదీర్చారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2: ముక్కంటి ఆలయానికి అనుబం ధంగా కనకా చలం పై వెలసిన కనకదుర్గమ్మకు శుక్ర వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహు కాలం సమయంలో అమ్మ వారి మూల మూర్తికి వివిధ పూజా ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు చేశారు. మహిళలు పెద్దసంఖ్యలో అమ్మ వారికి దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సామూహిక లలితా సహస్ర నామం పఠించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలం కరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఇందిరానగర్‌లో జగన్న ఆరోగ్య సురక్ష

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 2: వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ పంచాయతీలో జగనన్నఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పలువురు వైద్యపరీక్షలు చేయించు కున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సర్పంచ్ సల్ల వీరభద్రమ్, మాజీ సర్పంచ్ చిన్న, ఎస్సీ సెల్ కన్వీనర్ సురేష్, వైద్యులు దామోదర్, ద్వైత, ఉదయ్‌కుమార్, స్వర్ణలత, ప్రవీణ్, జయగోపాల్, ఏఎన్ఎం నిర్మల, బిందు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పురాతన శివాలయాల జీర్ణోద్ధరణ



పురాతన శివలింగాన్ని పరిశీలిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2: పలుశివాలయాలను జీర్ణోద్ధరణ చేస్తామని ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తెలిపారు. చుక్కల నిడిగల్లు ఎస్టీ కాలనీలో ఉన్న పురాతన శివలింగాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ధూర్జటి మహాకవి ఆ శివలింగాన్ని పూజించినట్లుగా పూర్వీకులు చెప్పేవారని గ్రామస్తులు అంజూరు శ్రీనివాసులకు వివరించారు. త్వరలోనే ఈ శివాలయంతో పాటు శ్రీకాళహస్తి మండలంలోని ఏంపేడు, వెల్లంపాడు, తొండమనాడు గ్రామంలోని శివాలయాలను జీర్ణోద్ధరణ చేస్తామని అంజూరు శ్రీనివాసులు చెప్పారు. కాగా చుక్కల నిడిగల్లు గ్రామంలో ఉన్న ముక్కంటి ఆలయ భూములను పరిశీలించారు. భూములకు రక్షణ కల్పించేలా కంచె ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే లోడింగ్.. అన్‌లోడింగ్

ప్రజలకు, ద్విచక్ర వాహనదారులకు తప్పని తిప్పలు



బుగ్గవీధిలో రోడ్డుపైనే ఆపిన భారీ వాహనాలు

రేణిగుంట, ఫిబ్రవరి 2: పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో వ్యాపారస్తులు నడిరోడ్డుమీదే లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్నారు. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. స్థానిక బుగ్గవీధి మెయిన్‌లైన్‌లో ఏజెన్సీలు, టోకు వ్యాపారులు తమ సరుకుల రవాణాకు సంబంధించి భారీ వాహనాల నుంచి ఆటోల వరకు నడి రోడ్డుపైనే గంటల తరబడి ఆపి లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుంటారు. బుగ్గవీధి లే అవుట్‌లో ఉన్న 22 వీధుల నుంచి బజారుకు, బస్టాండ్‌కు వెళ్లేందుకు ఇదే ప్రధాన వీధి కావడంతో ఈ మార్గం గుండా నిత్యం రాకపోకలు జరుగుతుంటాయి. రోడ్డుపై వాహనాలు అడ్డంగా ఉండ డంతో వేరే మార్గంలో వెళ్లాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. భారీ వాహనాల కారణంగా గతంలో వేసిన సిమెంట్ రోడ్డు దెబ్బ తింటోంది. ఈ వీధిలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉన్నప్పటికీ పోలీసులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అలాగే బజారు వీధి, పోస్టాఫీసు వీధి, జీఎం మొదలి వీధుల్లో వ్యాపారులు రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు చేయడంతో వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొం టున్నారు. శనివారం వారపు సంత జరిగిన రోజు పోస్టాఫీసు రోడ్డులో ట్రాఫిక్ పద్మవ్యూహంలా ఉంటుంది. కాగా పోలీస్ స్టేషన్‌లో రెండు ఎస్ఐ పోస్టులు ఖాళీగా ఉండడంతో ట్రాఫిక్ సమస్య పట్ల పర్యవేక్షణ కరవైంది. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.